


లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

# మానవుడు - జీవిత పరమార్ధము

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య ప్రబోధములు)




సంకలనము

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

నరుడైనందుకు పరమాత్ముని మది నమ్మిన నరుడని యెంచవలెన్
శ్రీ సాయీశుని గనలేని నరుని, నరపశువని భావింపవలెన్ ॥నరు॥

కామక్రోధ మోహంబుల దాటి మున్మూలస్థానము చేరవలెన్
సూటియెరిగి యానాటక ధారుని ధాటిగ మది సేవించవలెన్ ॥నరు॥

బూటకమగు పెన్ మాయాజాలమున పూటలు గడవక యుండవలెన్
మాటి మాటికి పరమాత్ముండని మర్మమెరిగి భజియించవలెన్ ॥నరు॥


జాతి నీతి మత శాస్త్రములాదిగ సర్వము వీలుగ జూడవలెన్
కోతిగుణంబు మాని యా పరంజ్యోతి రూపమును జూడవలెన్ ॥నరు॥

చాలు చాలునిక భవనాశంబులు సంకటముల అణగింపవలెన్
కాలుని వలలో చిక్కక తనలో గాలి మనంబుల గలుపవలెన్ ॥నరు॥

ఓం

# మానవుడు - జీవిత పరమార్థము

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య ప్రబోధములు)



<u>సంకలనము</u>

తూములూరు ప్రభ

తూములూరు కృష్ణమూర్తి

మానవుడు - జీవితపరమార్థము

ప్రథమముద్రణ - 2003

ప్రతులు - 1000

వెల - రూ. 12/-

ప్రచురణ :
తూములూరు పబ్లికేషన్స్
"అనసూయ" సి - 66, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాదు - 500 007. ఫోన్ : 27614083, 27631904.
Emai : tumuluru@hd1.vsnl.net.in

ప్రతులకు :
శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్ ట్రస్టు
ఆంధ్రప్రదేశ్, 'శివం' నల్లకుంట, శివం రోడ్డు,
హైదరాబాదు - 500 044.

సంకలనము :
తూములూరు ప్రభ
తూములూరు కృష్ణమూర్తి
ఫోన్ : 040-27614083, 27631904.
Emai : tumuluru@hd1.vsnl.net.in

Printed at :
**SAIRAM PRINTERS**
**Phone : 040-23232316, 23237598**



# పీఠిక

మానవ అంటే రెండు అర్థములు ఉన్నవి. ఒకటి 'మా' (కాదు) 'నవ' (కొత్త, నూతనమైన, అపూర్వమైన) అతను నూతనమైన వాడు కాదు. ఇంతకు పూర్వమే అతనికి చాలా చరిత్ర ఉంది అని అర్థం. మా......న.......వ అంటే అజ్ఞానము, అవివేకము లేకుండా అని మరొక అర్థం. 'మా' (అజ్ఞానము, అవివేకము) 'న' (లేకుండా) 'వ' (వర్తించువాడు). ఆ మానవ జన్మ చాలా పవిత్రమైనది. మరల రాదు అందుకే "జంతూనాం నరజన్మ దుర్లభం" అన్నారు.

అలాంటి మానవుడు మానవతా విలువలైన 'సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలకు నిలయమైనవాడు, ఈనాడు తన్ను తాను మరచి, స్వార్థ స్వప్రయోజనములకు కామ, క్రోధ, మోహ, మద, మాత్సర్యములకు లోనై అహంకారమమకారములకు వశుడై పవిత్ర జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాడు.

పుట్టినప్పుడు క్యావ్, క్యావ్ అని ఏడ్చి కోహం నేనెవరు? నేను ఈ దేహమా? నాహం, కాదు. లేక ఇది వేరా, అది వేరా? వీటన్నిటికి ఒక్కటే సమాధానం. సోహం అదే నేను అంటే ఆ పరమాత్మనే నేను. నేనే ఆత్మను అని గుర్తించుతాడు. తర్వాత తన్ను తాను మరిచిపోతాడు. నేనెవరు? నేను ఎక్కడనుండి వచ్చినాను, ఎక్కడకు పోతున్నాను అన్న ప్రశ్న ప్రతి మానవుడు విచక్షణ, వివేక జ్ఞానంతో వేసుకోవాలి. సమాధానం కోసం కృషి చేయాలి.

మానవుని జీవితలక్ష్యము, జీవితగమ్యము గుర్తుచేసుకోవాలి. మానవహీనుడుగా, మానవ దానవుడుగా, మానవ పశువుగా, మానవ మానవుడుగా ఆకారమానవుడుగా కాకుండా ఆచారమానవుడుగా జీవించుచూ, మానవ దైవత్వము చేరుకొనేటట్లు ప్రయత్నించాలి మానవుడు. అప్పుడే జీవితము సార్థకమవుతుంది.

"దేహాన్ని నమ్మవద్దు. లోకాన్ని విశ్వసించవద్దు. దైవాన్ని వదలవద్దు. ఆధ్యాత్మికంలో ఈ మూడింటిని ప్రధానంగా పాటించాలి" అంటారు భగవాన్.

ఈనాడు లోకంలో ఎక్కడ చూచినా భయమే. భయంలేని మానవుడు ఎక్కడా కనిపించడంలేదు. అయితే భగవంతుని అభయం పొందుతే భయానికి చోటేలేదు. దైవానుగ్రహమే అభయత్వాన్ని అందించగలదు. అట్టి అనుగ్రహానికి మనం పాటు పడాలి. దైవానుగ్రహాన్ని పొందాలంటే దైవ విశ్వాసాన్ని పెంచుకోవాలంటారు భగవాన్.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి ప్రబోధములనుండి కొన్ని అంశములు క్రోడీకరింపబడినవి. అవి మనమందరము మనన నిధిధ్యాసనములతో వివేక, విచక్షణలతో పరికించి, అనుసరించి, ఆచరించి జీవితములను ధన్యము గావించుకుందాము.

స్వామివారి పాదపద్మములకు ప్రణమిల్లుతూ

హైదరాబాదు - 500 007. తూములూరు ప్రభ

30-04-2003 తూములూరు కృష్ణమూర్తి



# మానవ / మానవుడు, మనిషి / మనుష్యుడు / మనుజుడు, నరుడు అనునవి పర్యాయపదములు

వీటిని భగవాన్ బాబావారు ఈవిధంగా వివరించారు.

1. మానవ / మానవుడు :

మానవ 'మా' అనగా అజ్ఞానము, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించటము. అజ్ఞానము లేకుండా వర్తించేవాడు అనేది సరైన అర్థము.

**మానవుడు సుఖాభిలాషి, ఆనందపిపాసి.** అహోరాత్రములు అనేక శ్రమలు పడి ఈ సుఖానందములను సంపాదించుకొనుటకై కృషి చేస్తున్నాడు. అన్ని రంగముల యందు **మానవుడు ఆశించునవి రెండు; ఒకటి సుఖప్రాప్తి, రెండవది దుఃఖనివృత్తి.** ఆధ్యాత్మికమునందే కాక వైజ్ఞానికమునందు దీనికి ఆధారములుంటున్నవి. మానవుడు సుఖాన్ని కోరటంలో, ఆనందమును ఆశించుటలో అంతరార్థము ఏమిటి? **మానవుని స్వభావము స్వరూపము ఆనందమే.**

**ఆత్మజ్ఞాన విచారమే సనాతన ధర్మము.** ఆత్మజ్ఞాన విచారమే జీవుని కర్తవ్యము. 'అంతవంత ఇమే దుఃఖదేహాః' దేహత్వము అంతమయ్యేది. పంచభూతములు పాంచభౌతిక దేహమును బాధింపవచ్చునే కాని, ఆత్మతత్వాన్ని అవి చలింపలేవు. శరీరము, మనస్సు, ఆత్మల కలయికనే మానవుడు. ఇవి మానవుని భావములను నిర్ణయించి అతణ్ణి ఉన్నతస్థితికి గొనిపోయే సోపానములు. **కర్మలు ఆచరించునది దేహము, తెలుసుకొనునది మనస్సు, నిత్యమై సత్యమై నిరంతరము ఉండునది ఆత్మ.** ఇదియే మానవుని యందలి దేవత. చేయుట, తెలిసికొనుట, ఉండుట ఈ త్రిశక్తులు అభివ్యక్తియే మానవత్వము. మనసు, దేహము, ఆత్మ వేరు వేరు రూపములచేత వేరు వేరు ఫలితములును అందించుచు వేరు వేరు నామములు కలిగి ఉండినప్పటికిని ఈమూడింటి ఏకత్వముచేతనే మానవత్వము దివ్యత్వము నొందుచున్నది. ఈ మూడింటి భిన్నత్వమే మానవుని పశుత్వమునకు గొనిపోతుంది.

జగతిని జీవించువాడు మనుజుడుకావలె మొదట
దనుజులందు దుష్టత్వము పొగడువాడు చవట
బ్రహ్మవిద్యనేర్చి ఇచట ఆధ్యాత్మను కనుగొనుట
రాజయోగమునకు బాట, యిదియే సాయి చెప్పుమాట.

హృదయమనే క్షేత్రమందు కలదు ఒక్క కల్పతరువు
దానిచుట్టు కలుపు ముండ్ల కంప పెరిగియుండు
కలుపు తీసి శుభ్రపరచ కల్పతరువు కానపడును
అదియే నీ అభీష్టములనొసగు **కామధేనువు.**

కల్పవృక్షమూ, కామధేనువూ ఒక్క మానవుని యందే ఉంటున్నవి. ఈ మానవత్వమనేది గోచరమయ్యే వస్తువునకు, అగోచరమయ్యే వస్తువునకు మధ్య ఒక వారధివలె ఉంటున్నది. ఇట్టి మానవత్వం మధ్యలో ఉన్నది. కాబట్టే **మానవునికి మర్త్యుడు అని మరొక పేరు.**

**2. మనిషి / మనుష్యుడు / మనుజుడు :**

మనిషిని ఇంగ్లీషులో Man అంటారు. అనగా "M" మనస్సు-మాయ (Mind-Maya). దీనిని వశపరుచుకోవాలి. "A" అనగా ఆత్మతత్త్వం. దీనిని అర్థము చేసుకోవాలి అప్పుడే "N" అనగా నిర్వాణం (Nirvana) చేకూరుతుంది. ఈ నిర్వాణం కోసమే బుద్ధుడు అనేక సాధనలు జరిపాడు. సర్వం మానవుని యందే ఉన్నాయి కాని మానవుడు పోగొట్టుకున్నాడు. శరీరము, మనస్సు, ఆత్మల కూడిక మనుష్యుడు.. ఇక ఆత్మ. ఇది నిత్యము శుద్ధము, సత్యము, నిర్మలము, నిస్వార్థము, ప్రకాశవంతమైన స్వరూపము, మార్పుచెందునది కాదు. ఇది మానవుని **అంతరాత్మయందు (గుహయందు) పరంజ్యోతిగా వెలుగుచున్నది. దీనినే దైవత్వమని చెప్పుచున్నది శాస్త్రము.**

మనుజుడైనవాడు తన దుర్గుణమ్ముల
వరుసనొకటి యొకటి వదల వలయు
పశుగుణంబు వీడి పశుపతి కావలె
సత్యమైన బాట సాయిమాట.



**3. నరుడు :**

నరుడనగా అర్థమేమిటి? **ఆత్మకే 'నరః' అని పేరు. నరః అనగా ఆత్మస్వరూపుడే.**

నీటి యందే పుట్టి, నీటి యందే నిలచి
నీటి యందే అడంగు నీటి బుడగ
నరుడు బుద్బుదము నారాయణుడు నీరు
సత్యమైన మాట సాయిమాట.

చెవులకెవ్వడు వినుశక్తి చేర్చెనోయి
కనుల కెవ్వడు ఇచ్చెను కాంతిరేఖ
**అట్టివానిని వెతికెడి వాడె నరుడు.**

శ్రీరామచంద్రుడు "ఓ. పురజనులారా ! ఓ గురుబ్రాహ్మణులారా ! నమస్కారము. నామాటలను శాంతముగా వినుడు. స్వార్థపరుడనై నేను దురభిమానముతో ప్రసంగించుట లేదు. నేను మీ రాజునని చెప్పుటయుకాదు. మిమ్ముల చెడుమార్గముల సంచరింపుడని బోధించుటయుకాదు. **నామాటలు మంచివని మీకు తోచినయెడల ఆ ప్రకారము సంచరింపుడు. నా మాటలను విని వాటి ప్రకారము నడుచుకొనువాడే నా స్నేహితుడు. వాడే నా తమ్ముడు.** నేనొక తప్పు మాట చెప్పినను, మీరు వెనుదీయక, నా తప్పును నాకు చూపుడు. **అన్ని జన్మలకంటే నరజన్మము దుర్లభము** అని వేదపురాణములును, మహనీయులును చెప్పిరి. చెప్పుచున్నారు. ఎంత పుణ్యముచేసియుండిన కాని నరుడై పుట్టడు. అది దేవతలకు సహితము దుర్లభము. నరజన్మ మోక్షద్వారము సకల సాధనములకు రాజమార్గము," అని బోధించాడు.

మాట చెప్పినట్లు మనుజుండు నడచిన
మనిషి కాదు వాడు మహితుడవును
మాట చెప్పినట్లు మనిషి నడువడేని
మృగమెగాని వాడు మనిషి కాదు.

**నరపశువు :**

**నరుడైనందుకు పరమాత్మయని**
**తలచిన నరుడని ఎంచండి**
**భగవన్నామము వలదనె నరుని**
**నరపశువని భావించండి.**

పేలముల పైని పేరాశ విడువ లేక
బోను నందెలుకలు పడిపోయినట్లు
తుచ్ఛ విషయ సుఖాసక్తి దూలి నరుడు
వద్దనే యున్న ఆనంద పదవి వదలు.

సకల సద్గుణములు చక్కగా లేకున్న
వాడు నరుడు కాదు వాస్తవముగ
సవినయుండుగాక సచ్చరితుండెట్లగును
ఉన్నమాట తెలుపు చున్నమాట ॥

పాపకర్మంబు నరుడు ఓపికతోచేయు
పాప ఫలము కుడువనోపకుండు !
పుణ్యము విడుచు బుద్ధిపూర్వకముగాను
పుణ్య ఫలము గుడువబోవు నరుడు ॥

'నర' శబ్దమునకు అంతరార్థం తెలుసుకోవాలి. 'న' అనగా కాదు. 'రః' అనగా మృత్యువు. నాశనము కానటువంటి తత్త్వమునకే 'నరః' అని పేరు. 'నరుడు' అనగా నాశనం కానటువంటివాడు. నర, నారద, నారాయణ – ఈ మూడు పదముల అంతరార్థమును తెలుసుకుంటే, ఈ మూడు ఒక్కటే అని తెలుస్తుంది. నరునకు నారాయణుని చూపించి నటువంటి వాడే నారదుడు. 'నర' తత్త్వమునకు ఎంతటి ఉత్తమమైన అర్థములో ఉంటున్నాయి. నరునికంటే దైవం వేరొకడు కాదు. దైవం తనకంటే భిన్నంగా లేదు. **నరుడు నారాయణుడుగా మారాలి.**



**ఐదు దశల మానవత్వం :**

మానవ దైవత్వం ఒకటి. మానవ మానవత్వం రెండోది. మానవ దానవత్వం మూడోది. మానవ పశుత్వం నాలుగోది. మానవ హీనత్వం ఐదోది.

**మానవ దైవత్వం :** మానవునిలో ఒక దివ్యత్వమున్నది. మానవునిలో ఆత్మతత్వమే లేకపోతే మానవ జీవితమే వ్యర్థమయ్యేది. ఈ ఆత్మతత్త్వంపైన మనస్సును నిలిపి దేహమును ఒక ఉపాధిగా భావించి జీవితాన్ని పవిత్ర మార్గములందు పెట్టాలి. నిరంతరం మంచి చింతనలు చేయడం, దాన ధర్మాలు చేయడం, సేవా కార్యాలకు పూనుకోవడం దైవ ప్రేమతో జీవితాన్ని పునీతం చేసుకోవడం మానవదైవత్వం.

**మానవ మానవత్వం :** అనగా కర్తవ్య కర్మలాచరించడం. బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం – ఈ నాలుగు మార్గములందు జీవితాన్ని సక్రమంగా ప్రవేశపెట్టడం – వయస్సును బట్టి మన ప్రవర్తనలను పవిత్ర మార్గంలో పెట్టుకోవడం – ఇది ప్రతి మానవుడు చేయగలిగినది. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే మానవత్వ విలువలకు అనుగుణంగా జీవితం గడపడం మానవ మానవత్వం.

మానవ అనగా కొత్తది కానిది. అనేక జన్మలుగా వస్తున్నది. పాతదే-రోతదే! అజ్ఞానం లేకుండా వర్తించడం అనే మరొక అర్థం కూడా ఉంది. మానవ అనే మాటకు అపవిత్ర మార్గములననుసరించకుండా మానవునిలోని దివ్యత్వానికి అనుగుణమైన కర్మమార్గాన్ని అనుసరించడం అని అర్థం.

**మానవ దానవత్వం :** ఆహార విహారములందు, ఆచార విచారాలలో కాఠిన్యాన్ని అవలంబించడం మానవదానవత్వం. దయా దాక్షిణ్యాలు, నీతి నిజాయితీలను కోల్పోయిన జీవితమిది. కేవలం స్వార్థంతో కూడిన తత్త్వం. ఆకారానికి మానవత్వం. క్రియలో దానవత్వం. ధర్మవిరుద్ధమైన కార్యాలకు పూనుకోవటమే దీని లక్షణం.

**మానవ పశుత్వం :** వీరికి ఆహార నిద్రాభయమైథునాదులు తప్ప జీవితంలో ఇంకేమీ లేదు. తినడం, నిద్రించడం, ఆశపడటం, అనుభవించడం, ఖానా, పీనా, సోనా, మర్నా – తినడం, త్రాగడం, నిద్రించడం, చావడం ఇంతే. ఇది మానవ పశుత్వం.

**మానవతా హీనత్వం :** మానవపశుత్వం కంటే అధమమైనది మరొకటి ఉంది. తన స్వార్థాన్నైనా వదలుకొని ఇతరులను హింసించడం. తనకు రెండు కన్నులు పోయినా

ఫరవాలేదు కాని ఇంకొకనికి ఒక్క కన్నైనా పోవాలి. ఉపకారం చేసిన వానికి కూడా అపకారం చేయాలి!! మానవుడు కనీసం మానవుడుగానైనా బ్రతకకుండా మానవత్వాన్ని విస్మరించి జీవించడం మానవతా హీనత్వం. మానవత్వమే లేకపోతే చదివిన చదువులు శ్మశానంలో నక్కల అరుపులతో సమానం. ఆచరణ లేనిది ఎంత చదివి ఏమి లాభం? వేద శాస్త్ర పురాణేతిహాసా లెన్ని కంఠస్థం చేసినా ఆచరణ లేనిది అవి కేవలం కంఠశోష.

దేహము - దేహి, శరీరము -శరీరి, క్షేత్రము - క్షేత్రజ్ఞుడు : దేహములో నివసించే వాడు దేహి, శరీరములో నివసించేవాడు శరీరి, క్షేత్రములో నివసించేవాడు క్షేత్రజ్ఞుడని పిలుస్తారు. ఇవన్నీ పర్యాయపదములే. అన్నీ ఒక్కటే. అదే ఆత్మ.

రక్తము మాంస శల్యముల రాశియు దేహము మీరు కాదు సు
వ్యక్తము కాని కోరికల వ్యర్థ మనస్సును మీరు కాదు ఆ
ముక్తికి భంగకారియగు మోహపు భ్రాంతియు మీరు కాదు,
మీ శక్తిని మీరెరుంగగల శాశ్వతుడౌ పరమాత్మ మీరెగా!

దేహము ఇంద్రియములు మనస్సు బుద్ధి ఈ నాలుగు మానవుడు ధరించిన ఉపాధులు మాత్రమే. ధరించిన పదార్థముల రహస్యమును గుర్తించినప్పుడే ఆ పదార్థములను సరియైన స్థితిలో మనము ఉపయోగించుకోవచ్చును.....

దేహమును ఏ విధముగా అనుభవించాలి? ఏ విధముగా దీనిని వినియోగించాలి? అనే విషయమును మొట్టమొదట గుర్తించినప్పుడే ఈ దేహము సద్వినియోగమవుతుంది. **"దహ్యతే ఇతి దేహః" అని దీని ఉత్పత్తి అనగా దహింపబడేది ఈ దేహము అని.** మరణించిన తరువాత దహింపబడటము అందరికి తెలుసు. అట్లుకాక జీవితసమయమునందే ఇది దహింపబడుతున్నది. చింతలచేత ఈ దేహము దహింప బడుతున్నది. ఇది జడస్వరూపమైనట్టిది. మాలిన్యముతో కూడినట్టిది.

"దేహము పాంచ భౌతికము
దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు
గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధనల ముద్రలు లేవు



నిజంబు చూడ నా దేహియె దేవదేవుడు"

మదిని గమనింపగ ఆత్మస్వరూపుడై ఉన్నాడు.

అ దేవ దేవుడైన మీరు ధరించినదే ఈ దేహము. ధరించిన దేహమును వరించ వచ్చు. అనుభవించవచ్చు కాని ఏ విధముగా వరించాలి? ఏ విధముగా అనుభవించాలి అనే విచక్షణ జ్ఞానముతో దీనిని పొందాలి. **దీనికి మరొక పేరు శరీరము అని. దీని ఉత్పత్తి "శీర్యతే ఇతి శరీరః"** అనగా జీర్ణించునది, క్షీణించునది ఈ శరీరము. ఇది పుట్టినప్పుడు రక్తపు ముద్దగా ఉంటుంది. కోమలత్వముతో ఆకర్షింపచేస్తుంది. క్రమక్రమేణా యిది యవ్వనములో ప్రవేశిస్తుంది. అహంకారమును ప్రకటిస్తుంది. తదుపరి వృద్ధాప్యములో ప్రవేశిస్తుంది. వికారత్వాన్ని పొందుతుంది.

**ఈ శరీరమునకు మూడవ పేరు మందిరము అని.** ఈ మందిరము దేని నిమిత్తమై ఏర్పడినది? **"దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవ స్సనాతనః" దేవుడైన జీవునకు ఈ దేహము ఒక మందిరముగా నిర్మించబడినది.** మందిరమును ఏ విధముగా ఉపయోగించాలి? ఇది పవిత్రమైన దివ్యమైన భగవంతుని నిలయము. భగవంతుని నిలయమైన దేహమును దుర్వినియోగపరచుటకు ఏ మాత్రము వీలులేదు. సక్రమమైన మార్గములో పవిత్రమైన మార్గములో వినియోగించాలి. సత్కర్మలు, సదాచారములు సచ్చింతనలు సలిపే నిమిత్తమై ఏర్పడినదే ఈ దేహము. **"శరీర మాద్యం ఖలు ధర్మసాధనం" ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినదే ఈ దేహము.** ఈ దేహమును సరియైన స్థితిలో ఉంచుకోవాలి. ఈ దేహము ఒక పనిముట్టు వంటిది. పనిముట్టు సరియైన స్థితిలో వుండినప్పుడే మనము సంకల్పించుకున్న పనిలో సరియైన రీతిగా ఉపయోగించుకోవచ్చును. దీనిని వినియోగించుకోవాలంటే సరియైన స్థితిలో పెట్టుకోవాలి. మానవుడు ధనమును కోల్పోతే దానిని ఎన్నో మార్గాల ద్వారా తిరిగి సంపాదించుకోవచ్చు. స్నేహితుని కోల్పోతే ఎంతమంది స్నేహితులనో సంపాదించు కోవచ్చు. భార్యను కోల్పోతే రెండవ వివాహమాడవచ్చు. భూమిని కోల్పోతే దానిని కూడా తిరిగి సంపాదించుకోవచ్చు. కాని శరీరమునే కోల్పోతే అది లభ్యం కాదు. శరీరమును పవిత్రంగా భావింపవలెను. అది భగవంతునికి అర్పితము చేయాలి. ఈ దేహమును ఏయే కార్యములయందు సద్వినియోగము గావించుకోవాలో

విచక్షణాజ్ఞానంతో వినియోగించుకోవాలి. ఏ కార్యము చేయటానికి పూనుకొన్నా అక్కడ ఒక ప్రశ్న వేసుకోవాలి.

**ఆత్మ స్వరూపుడైన బ్రహ్మను నేను ఈ కాయములో నివసిస్తున్నాను. కనుక ఆత్మ స్వరూపుడైన నేను, బ్రహ్మస్వరూపుడైన నేను ఈ కాయముతో ఈ కర్మలు ఆచరించవచ్చునా, ఆచరించకూడదా? అని విచారణ చేసుకోవాలి.**

ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినది దేహము. **దైవమందిరముగా నిర్ణయించబడినదీ దేహము. దీనికి మరొకపేరు క్షేత్రము. "క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానమ్"** అనగా క్షేత్రమనే దేహము దీనిని గుర్తించేవాడు క్షేత్రజ్ఞుడు. నీవు క్షేత్రాన్ని గుర్తించేవాడవేకాని గుర్తింపబడేది దేహమే.... పవిత్రమైన స్థితిలో దీనిని ఉంచుకోవాలి. కాశీని క్షేత్రము అంటారు. బదరీని క్షేత్రము అంటారు. తిరుపతిని క్షేత్రము అంటారు. **పవిత్రస్థానము కనుక క్షేత్రమనే సార్థకనామము.** ఆ క్షేత్రములో నిరంతరము పూజలు సత్కర్మలు మంత్రములు, దీక్షలు జరుగుతుంటాయి. అదేవిధముగా ఈ దేహమనే క్షేత్రము నుంచి సత్కర్మలు, సదాచారములు, సచ్చింతనలు ఇలాంటి సేవలు చేసుకోవాలి. సత్కర్మల యందు ప్రవేశింపచేయటమే క్షేత్రము యొక్క అంతరార్థము. **క్షేత్రము అంటే పొలము అని రెండవ అర్థము. పొలములో మనము ఎట్టి విత్తనములు నాటుదుమో అట్టి ఫలమే మనకు లభిస్తుంది.** సత్సంకల్పములనే విత్తనములు నాటినప్పుడు సత్ఫలము లభ్యమవుతుంది. దుస్సంకల్పములు అనే విత్తనములు నాటినప్పుడు దుష్ఫలములే లభిస్తుంటాయి.

పాపపుణ్యములనే బీజములు నాటుకొనే ప్రదేశమే ఈ దేహమనే క్షేత్రము... ఫలాని ఋతువునందు ఫలాని విత్తనములు నాటాలి అనే పద్ధతి వుంటుంది. ఏ క్షేత్రమునందు ఏ పంటను పెట్టాలి అనే నియమం ఉంటుంది. ఎప్పుడు పడితే అప్పుడంతా పొలములో విత్తనములు చల్లటానికి వీలుకాదు. ఒక నిర్ణీతకాలముంటున్నది. **కానీ ఈ శరీరమనే పొలములోపల నిర్ణీతమైన కాలములేదు. సర్వకాల సర్వావస్థల యందు దీనిని సాగుచేసే అనుకూలమున్నది.** రాత్రింబవళ్ళు దీనిని సాగు చేసుకోవచ్చును. పొలములో విత్తనములు నాటినప్పుడు పంటలు పండవచ్చు లేకపోతే ఎండవచ్చును. ఆశించిన ఫలములు మనము పొందలేకపోవచ్చును. కానీ ఈ శరీరమనే క్షేత్రమందు నాటుకున్న



సత్సంకల్పములు, దుస్సంకల్పములు అవి ఏమి చేసినా తప్పేది కాదు. ఆ ఫలము తప్పక అనుభవించవలసి వస్తుంది. నూటికి నూరుపాళ్ళు పంట పండుతుంది. ఏ మాత్రము తక్కువ కాదు.

ఇది చేతు అది చేతు ఇంకెన్నియో చేతు
ననుచు ఊహలు అల్లి అలసిపోకు
ఏ విత్తులను నాటి ఇచ్చోట నుంటివో
ఆ ఫలములే నీకు అందుచుండు
విత్తనంబొకటైన వేరైన ఫలములు
సమకూరుటది ఎట్లు సాధ్యమగును?

కనుక ఈ దేహమనే పొలమందు యేవిత్తనములు నాటుతున్నామో అదే పంట మనము అనుభవించవలసి వస్తుంది. పంట మన సంకల్పములపైన ఆధారపడి ఉంటున్నది. మనకర్మలపైన ఆధారపడి వుంటున్నది..... దేహమును ఏ విధముగా వినియోగించుకోవాలి అనే విచారణ అత్యవసరము. సద్వినియోగము గావించాలని ఆశించేవారు, సద్భావములు అభివృద్ధి గావించుకోవాలని ఆశించేవారు, సత్ఫలములు పొందాలని ఆశించేవారు రెండు విధములైన మార్గములను తూ.చ. తప్పకుండా అనుసరించాలి. **ఆహార విహారములు సరియైన మార్గములో అనుభవించాలి...**

**ఈ దేహము అనిత్యము అశాశ్వతము** అయినప్పటికిని నిత్యసత్యాన్ని గుర్తించేవరకు ఈ దేహమును ఆధారముగా తీసుకోవాలి. అనేకమంది దేహపోషణను అలక్ష్యము చేస్తున్నారు. కనుకనే అనేక రోగములకు గురౌతున్నారు. దివ్యమైన ఆనందమును అందుకోలేకపోతున్నారు. **"ధర్మార్థకామమోక్షాణాం ఆరోగ్యం మూలముత్తమం".** చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థకామమోక్షములను ఆశించవలెనన్నను, అనుభవించవలెనన్నను ఈ దేహమునకు ఆరోగ్యము అత్యవసరము. దీనికి ఏ విధమైన మార్గాన్ని అనుసరించాలి? సరైన విచారణచేత ప్రవర్తనలో మార్పులు తెప్పించుకోవాలి. **ఆహారము వలన కలిగే అనారోగ్యముకంటె మానసిక సంబంధమైన అనారోగ్యమే ఈనాడు అభివృద్ధి అవుతోంది. మానవుడు నిరంతరము యోచించటము చేస్తున్నాడు.** ఈ యోచనకు రూపము ఏమిటి? ఈ విచారమునకు రూపము ఏమిటి? What is

the shape of worry? It is only mentally created fear. మానసిక సంబంధమైన ఆలోచనల చేతనే అనారోగ్యమునకు గురౌతున్నాము. మనము ఏ మాత్రము ఆలోచన చేయకూడదు. ఈ ఆలోచన ఒక్కొక్క సమయములో హద్దు మీరి పోతుంటాది. ఇది హద్దు మీరి పోయినప్పుడు అస్తవ్యస్తముగా మారిపోతుంది. తద్వారా మానసిక వ్యాధులు సంభవిస్తాయి. అనేకమందికి మతి భ్రమణము కలగటానికి కారణం ఇదియే. **ఎంత వరకో అంతవరకు చింతించాలి. మితిమీరిన చింతన చేయకూడదు. గడిచిపోయిన దానిని, రాబోయేదానిని అనవసరముగా చింతించి అనారోగ్యమునకు గురి అవుతున్నాము.** ఈనాటి యువకులు ఈ విధమైన వ్యాధులకే గురి అయిపోతున్నారు. ఒక్కొక్క యూనివర్సిటీలో పరీక్ష చేసి చూచినప్పుడు 80%, 90% మానసిక సంబంధమైన భ్రాంతులచేతనే అనారోగ్యము పొందుతున్నట్లు తేలింది. పవిత్రమైన ఈ వయస్సునందు ఏ మాత్రం అనారోగ్యమునకు గురికాకూడదు. **సాధ్యమైనంత** వరకు మానసిక సంబంధమైన **విచారాలు తగ్గించుకోవటానికి చూచుకోవాలి. అధికముగా చదవటముగాని, అధికముగా ఆడటముగాని, అధికముగా పాడటం గాని, అధికముగా నిద్రించటముగాని శరీరమునకు హాని కలిగిస్తుంది.**

మలమూత్ర దుర్గంధ మాంసరక్తములతో కూడిన ఈ దేహమునందే దివ్యభవ్యనవ్యమైన ఆత్మతత్వము రాణిస్తూ వుంటున్నది. ఇది దేహ బలహీనముచేత తరగదు. దేహ బలముచేత పెరగదు. **పెరిగి తరగని తత్వమే ఆత్మతత్వము. ఇది నిరంతరము పవిత్రమైనది,** విలువైనది, బలమైనది. ఎట్టిపరిస్థితులయందు దీని విలువ యే మాత్రము తగ్గదు.

పెద్ద వజ్రమొకటి పెంటలో దొరికిన
విలువ మారబోదు వెలుగు పోదు
మంచి గుమ్మడి పండు కంచెలో వేసిన
రుచియు పోదు రూపు పోదు
గొప్ప నెమలి గ్రుడ్డు కోడితా పొదిగిన
వన్నె పోదు దాని చిన్నె పోదు.

దేహము అనేక మాలిన్యములతో కూడినదైనప్పటికిని యిందులో **నిశ్చలము, నిర్మలము,**



**నిస్వార్థమైన ఆత్మతత్వము నిరంతరము ప్రకాశిస్తూనే వుంటుంది.** అన్ని మతములవారు ఈ దేహములో వుండిన పుష్టిని, సంతుష్టిని కోరటంలో అర్థము ఏమిటి? **దేహమనేది భగవంతుని దేవాలయము అనే విశ్వాసమే దీనికి మూలకారణము. కనుక ఈ పవిత్ర దేహమును అలక్ష్యము చేయక, అశ్రద్ధపూనక, తగిన శ్రద్ధతో దీనిని సరియైన మార్గములో ప్రవేశపెట్టి కర్తవ్యకర్మలు ఆచరించటము మానవుని ప్రధాన ధర్మము.** ఇట్టి సత్యమును గుర్తించలేని వ్యక్తులు వ్రతములని, నోములని, ఉపవాసములని దేహమును కృశింప చేసుకొంటున్నారు. తద్వారా నిత్యసత్యమైన ఆత్మతత్వము గుర్తించలేము.

"దేవుడనగ వేరు దేశమందున లేడు
దేవుడనగ తనదు దేహమందె
పాపమనగ వేరు పరదేశమున లేదు
తాను చేయు పనుల తగిలి యుండు"

ఈ దేహము భగవంతుని నివాసమని విశ్వసించాలి. **"ఈ దేహము పవిత్రమైన మందిరము. ఇందులో సనాతనుడైన భగవంతుడు నివసిస్తున్నాడు.** ఈ దేహము ఎలాంటిది? పవిత్రమైనది కాదు. అయితే దేహి దేహం లోపల ఉన్నంత వరకు ఇది పవిత్రమే! కాని దేహి ఈ దేహాన్ని వదలిపోతే?

"మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాత సం
చలనము పొందు దుంప భవసాగర మీదగ లేని కంప అం
బుల పొది లెమ్ము చూడమనమెప్పు దలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మ బోకు మనసా హరిపాదము లాశ్రయింపవే"

కనుక హరి పాదముల నాశ్రయించండి. అది సుఖము. ఇది దుఃఖము, వీడు శత్రువు, వాడు మిత్రుడు అనే భేదభావాలకు అవకాశమివ్వకండి మిమ్మల్ని ఎవరైనా దూషిస్తే ఆ రూపములో భగవంతుడు నన్నీ విధంగా దూషిస్తున్నాడని అనుకోండి. ఆ రూపము. మీ రూపము రెండూ అస్థిరములే ఆ రూపములో నున్నదీ మీ రూపములో నున్నదీ రెండూ స్థిరములే ఇట్టి ఆత్మ భావాన్ని పెంచుకోండి. అదే మీరు చేయవలసిన తపస్సు.

అప్పుడే మీకు శాంతి చేకూరుతుంది. దేహాన్ని చక్కగా పోషించుకోండి. **దేహశక్తిని దైవానికి అంకితం చేయండి.**

## దేహమే దేవాలయము

దేవాలయమునకు ప్రాకారమని ఒకటుంటుంది. దీనిలో అక్కడక్కడ కొన్ని రంధ్రములు పెట్టి వుంటుంటారు. **'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవస్సనాతనః'** ఈ జీవుడనే దేవునకు ఈ దేహము దేవాలయము వంటిది. ఇదే దీని ఆవరణము. ఇందులో మమత్వమనేదే ఒక దట్టమైన కాంపౌండు. దీనిద్వారా అనేక యింద్రియములు ప్రచురితమైపోతూ వుంటాయి. కనుకనే ఈ దేహికి దేవాలయము అనే ఈ దేహము ఒక హద్దుగా నియమిస్తూ వచ్చారు. గొప్ప గొప్ప రాజులు నివసించే భవనములకు పెద్ద కోటగోడలు కడుతూ వుంటారు. ఈ కోటగోడకు నవద్వారములను పెట్టి వుంటారు. అదేవిధముగనే ఆత్మసామ్రాజ్యమనేదానికి మహారాజయిన దివ్యత్వమునకు దేహము ఒక కోటగోడ మాదిరిగా వుంటుండాది. దీనికి నవద్వారములు వుంటున్నాయి. **'నవద్వారే పురే దేహే'** అన్నాడు కృష్ణుడు. ఆగోడ జడమైన రాతితోనో, సిమెంటుతోనో, యిటుకతోనో కట్టబడి వుంటుండాది. కాని ఈ కోటగోడ రక్తమాంసములు, ఎముకలతో కట్టబడి వుంటుంది. ఈ దేహములో దేహి వుండినంత వరకును యిది అనేక విధములైన సుగంధములు విరజిమ్ముతూ వుంటుంది. ఈ దేహి దేహమును వదలిన తత్‌క్షణమే ఇది దుర్గంధములతో కుళ్ళిపోతుంది. ఇది **'తొమ్మిది చిల్లుల తోలుతిత్తియే** గాని, కాంతి కలిగిన వజ్రఘటము కాదు. నిముషనిముషమునకు నీచులూరునే గాని, పునుగు జవ్వాదీలు పుట్టబోవు'.

## నీటి బుడగ

దేహము ఒక నీటి బుడగ
మనసు ఒక పిచ్చి కోతి
కనుక దేహేంద్రియములను
మనస్సును అనుసరించకూడదు
వివేకముతో వర్తించాలి.



## క్షేత్రజ్ఞుడు

క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత
క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతంమమ

ప్రపంచమంతయు క్షేత్రక్షేత్రజ్ఞుల సమ్మిళితస్వరూపము. ప్రకృతి ప్రతిబింబమే మానవుని శరీరక్షేత్రము. విశ్వమునందున్న చేతనా చేతనములన్నీ మానవుని దేహమునందే యిమిడి వున్నవి. ఈ ప్రపంచమంతయు మానవుని యందుండిన ప్రతిబింబములే. Reflection of the inner being క్షేత్రజ్ఞుని తెలుసుకోవాలంటే జ్ఞానము కావాలి. ఏమిటీ జ్ఞానము? కేవలము పుస్తక జ్ఞానము కాదు. సూపర్‌ఫిషియల్ నాలెడ్జినా? కాదు. జనరల్ నాలెడ్జినా? అసలే కాదు. డిస్క్రిమినేషన్ నాలెడ్జా? ఇది వ్యక్తిగతమైనది. ఎక్స్పీరియన్స్ నాలెడ్జా? ప్రాక్టికల్ నాలెడ్జి కూడను వ్యక్తిగతమైనది. ఇవన్నియు భౌతికమైన, లౌకికమైన జ్ఞానములు. వస్తువిచారణ గుర్తింపబడే జ్ఞానము పదార్థ జ్ఞానము, విషయమును ఆధారము చేసుకొని దాని విశిష్టతను గుర్తించే జ్ఞానము విషయజ్ఞానము. ఈ విధమైన జ్ఞానములచేత దివ్యమైన ఆత్మతత్వమును ఎవ్వరు గుర్తించలేరు. **వజ్రము కోయవలెనంటె వజ్రమే కావాలి. కాలులో విరిగిన ముల్లును తీయాలంటే ముల్లే కావాలి. ఆత్మతత్వమును గుర్తించాలంటే ఆత్మ జ్ఞానమే కావాలి.** ఈనాడు భౌతికమైన ఈ ప్రపంచమునందు దేనిని జ్ఞానమని భావిస్తున్నామో అది అంతా అజ్ఞానమే. **ఆత్మజ్ఞానమే సత్యజ్ఞానము. ఆత్మ అన్నా, జ్ఞానమన్నా రెండూ ఒక్కటే. నిజమైన ఎరుకయే జ్ఞానము.** పదార్థములను క్రోడీకరించుకొని విషయాలను సంగ్రహించుకొని తద్వారా తెలుసుకొనే జ్ఞానము అజ్ఞానముతో సమానమే. ఈ జ్ఞానమునకు జ్ఞానము, జ్ఞేయము, జ్ఞాత అనే త్రిపుటి ఉండదు. ఇవి మానసిక వృత్తులు. **మనోనాశమైన తరువాత ఏర్పడే మూలాధారమైన తత్వమే జ్ఞానము.**

## క్షేత్రము

ఈ దేహము ద్వారానే అనేక పుణ్యములు సంపాదించి జ్ఞానమును పొంది మోక్షమును పొందుదురు కదా! అట్టి భగవద్విభూతులు నెలకొన్నచోటు కనుక ఇది క్షేత్రమని పిలువబడును. **క్షేత్రమన్న కవచమువలె జీవుణ్ణి కాపాడేదని మరొక అర్థము; భూమి**

అని మరొక అర్థము. పొలమనుటకు ఒక ఆధారము వున్నది. పొలమున యే విత్తనములు చల్లుదుమో నాటుదుమో అదే పంటను మానవులు తీసుకొందురు. కోసుకొందురు. శరీరం క్షేత్రం, క్షేత్ర పాలకుడు జీవుడు, పుణ్యబీజములను చల్లి సుఖ సంతోషములను పంటను పండించుకొనుచు, పాపబీజములను చల్లి దుఃఖమును అశాంతి అను పంటను పొందుచున్నాడు. జ్ఞానవిత్తనములు నాటి మోక్షమును ఫలమును పొందుచున్నారు. పొలమును రైతు తెలిసికొనునట్లు క్షేత్రమును దేహతత్వమును క్షేత్రజ్ఞుడను జీవుడు తెలుసుకొనును. క్షేత్రమునకు క్షేత్రజ్ఞునకు ఒక్కటి మాత్రమే వ్యత్యాసము. అది 'జ్ఞ' అను శబ్దము. జ్ఞ అనగా జ్ఞానము అని అర్థము. అనగా జ్ఞానము కలవాడే క్షేత్రజ్ఞుడనియు, జ్ఞానములేనిదే క్షేత్రమనియూ చెప్పవచ్చును". శరీరేంద్రియ మనోబుద్ధులు నాల్గింటి ఏకత్వస్వరూపమే క్షేత్రము అన్నారు. ఈ క్షేత్రము కేవలము జడమైనది. మనస్సు జడమైనదే. ఇంద్రియములు జడమైనవే. దేహము జడమైనదే. ఈ జడమైన వాటి స్వభావమును కంట్రోల్ చేసేది క్షేత్రజ్ఞుడు. ఈ క్షేత్రక్షేత్రజ్ఞులకు మధ్య కొంత అవకాశముంటుండాది. అదే సృష్టియొక్క పరిణామము. ఈ క్షేత్రము మరికొన్ని మాలిన్యమైనవానితోను శుద్ధమైనవానితోను స్నేహము కల్గి వుంటుంది. అవియే సత్వరజస్తమములనే త్రిగుణములు. ఈ సత్వరజస్తమోగుణములు చాలా విచిత్రమైనవి. చాలా ఆశ్చర్యమైనవి.

కాశీ, గయ, ప్రయాగ మొదలగునవి క్షేత్రములు. మన దేహమే కాశి. ఈ కాశి మధ్యలో గంగ ప్రవహిస్తున్నది. ఆ గంగయే మనయొక్క జ్ఞానము. ఈ జ్ఞానమనే గంగయందు భక్తి, శ్రద్ధ అనే యమునా సరస్వతులు లోనైపోతున్నాయి. భక్తి శ్రద్ధ, జ్ఞానము - ఈ మూడింటియొక్క ఏకత్వమే ప్రయాగ, అది మన హృదయస్థానమే.

## జన్మ / జన్మము

**మనిషి జన్మించేది మరల జన్మ పొందకుండా ఉండే మార్గము తెలుసుకోవటానికే.**

జన్మమునను నిజ జనులైె! జన్మించిన వారుందరు!
జన్మము తరువాత! మిగిలి జన్మించిన వారెందరు?
జన్మమెత్తి ధర్మ కర్మ శూన్యులైన వారెందరు?
జన్మమెంత తిరిగి నరజన్మము కనుకొనగలేరు!



జన్మించిన వారెందరు? జన్మమెత్తిన వారెందరు?

జనన మరణ మధ్య మందు జగన్నాటక రంగమందు కామక్రోధగానములు! లోభ మోహగీతములు! మదమాత్సర్య వేషములు! వ్యామోహముల ప్రదర్శనలు! నవరకముల ప్రదర్శనలు! తుదకు శాంతి పాఠములు.

బాల్యంబున పలువురితోకూడి
ఆట పాటల యందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్కి
కామనీ లోలుడై క్రాలుచుండు
అర్థవయస్సున ఐహికంబున మున్గి
ద్రవ్య మార్జించుటయందు దవిలియుండు
ముదిమి వచ్చిన యంత మురహరి తలవక
అది ఇది లేదని అలమటించి
వివిధ దుర్వ్యసనంబుల వీడలేక
భక్తి మార్గంబు వెతుక ఆసక్తి లేక
కర్మ పంకిలమున పడి క్రాలుచుండు
మట్టి కల్పును జన్మంబు మానవుండు.

## జన్మమృత్యు జరావ్యాధి దుఃఖదోషాను దర్శనము

జన్మమృత్యు జారవ్యాధి దుఃఖదోషాను దర్శనము అన్నింటి కంటెను ప్రధానమైనది. జన్మ దుఃఖము, మరణ దుఃఖము వ్యాధి దుఃఖము చూచుచుండియూ వాటి సత్యమును తెలిసికొనపోకుండుట మహా ఆశ్చర్యము. దీని పుట్టు పూర్వోత్తరాలు విచారించిన యేది తప్పిననూ మృత్యువు తప్పదని తేలుచున్నది. మానవులు దేనిని సుఖమని తలంచుచున్నారో అవి సుఖవేషముతో కనబడు దుఃఖాలే. నిజమును తెలిసికొనిన విషయ దోషములను మననము చేసినపుడు వైరాగ్యము చేకూరి జ్ఞానము సిద్ధించును.

## మరణము

పాంచభౌతికము, దుర్బలమైన కాయంబు ।
ఎప్పుడో విడిచేది ఎరుక లేదు ।
శతవర్షములదాక మితము చెప్పిరి కాని ।
నమ్మరాదా మాట నెమ్మనమున ।
బాల్యమందో, లేక మంచి ప్రాయమందో
ముదిమియందో లేక ముసలి యందో,
ఊరనో, అడవినో, ఉదకమధ్యమునో
ఎప్పుడో విడిచేది ఎరుకలేదు ।
మరణమే నిశ్చయము బుద్ధిమంతుడైన ।
దేహమున్నంతలో తన్ను తా తెలియవలయు ॥

## మరణము లేనిది ఆత్మ

ఆత్మకూ చావుకూ ఎట్టి సంబంధం లేదు. మరణము యొక్క అనుభవం దేహమునకే కానీ నిత్య, సత్య నిర్మలమైన ఆత్మకు అంటదు. అందువలననే మరణమన్న ఇష్టపడదు. ఇష్టపడనిది ఆత్మకానీ దేహము కాదు. మరణమన్న ఇష్టపడకుండా వున్న ఆ ఆత్మనీవు. నీవు సత్, స్వరూపుడవు. దేహముపై ఆరోపించే అమరధర్మం అవివేకము. దేహము సత్ కానేకాదు. ఆ సత్ పేరున నున్న నీవే ఆత్మ. కానీ ఆత్మకు మరణము రాదు. లేదు.

చావుపుట్టుక లేని శాశ్వతుండు । ఆది మధ్యాంతరహి
తుడనాది వాడు ।
తాను పుట్టక చావక, చంపబడక అంతటను సర్వసాక్షియై
ఆత్మయుండు.

## గుర్తించుకొనవలెను

అత్యంతాశ్చర్యకరమైన విషయమేమిటంటే మానవులు ఎవరికి వారు, తమకు మరణము సంభవించుననే విషయములో అనేక అపోహలకు లోనగుదురు. పుష్పములు, చెట్టును వదలి నేలరాలక ముందు వికసించి పరిమళమును వెదజల్లును. మానవుడు తన



అంత్యకాలమాసన్న మైనపుడు విచారవదనుడగును. పుష్పమువలె అంత్యకాలము సమీపించినపుడు తేజోమయుడై సత్కార్యములను చేపట్టవలెను. **మానవుడు రెండు విషయములను ఎప్పటికీ గుర్తుంచుకొనవలెను. అవి మరణము, భగవంతుడు. ఇక రెండు విషయములను మరచిపోవలెను. అవి మనకు ఇతరులు చేసిన హాని, మనము ఇతరులకు చేసిన మంచి.** వీటిని విడచి పెట్టకుండా జ్ఞప్తియందుంచు కోవడమంటే కొన్ని ఫలితములనాశించి ప్రాకులాడుట. అప్పుడు వాటి పరిణామములను కూడా అనుభవించవలసివచ్చును. మనము ఏమి యోచించినా, మన మనస్సులో ఏ భావమునకైనా స్థానము కల్పించినా మనము ప్రతిఫలమును అనుభవించెదము. అయితే మరణము సంభవించునను సత్యమును ఎప్పుడూ మనస్సు నందుంచుకోనవలసినదే. దీని వలన సత్కార్యాములను చేపట్టి హానికరములైన పనులకు దూరముగా నుండుటకు అవకాశమున్నది.

## మరువకూడదు

ఎలాంటి కష్ట సమయములయందుగాని, ఎలాంటి బాధల
యందుగాని దైవాన్ని మాత్రం వదలరాదు. దైవం ఒక్కడే.
హెచ్చుగ సంపదలొచ్చినగాని
ఏనుగు గుఱ్ఱములెక్కినగాని
పిచ్చోడని పేరొచ్చినగాని
ప్రియముతో పెద్దలు పొగిడినగాని
దేవుని మరువకురా!
ఉన్నది దైవము ఒక్కడురా !
దుష్టజనులు దూషించినగాని
దోషరహితుడై వుండినగాని
కష్టములెన్నో వచ్చినగాని
కాయము వ్యాధుల చిక్కినగాని
దేవుని మరువకురా!
ఉన్నది దైవము ఒక్కడురా!

యోగాభ్యాసము చేసినగాని
భాగావతాదుల చూచినగాని
పండితుడని బిరుదిచ్చినగాని
పాపిష్టోడని అన్ననుగాని
దేవుని మరువకురా!
ఉన్నది దైవము ఒక్కడురా!
నిందకు లోబడి నిలిచినగాని
నిండుచదువులే చదివినగాని
నిండు కుండవై వుండుమురా
నీవు ఎండని కుండగ నుండకురా
దైవము ఒక్కడురా!
ఉన్నది దైవము ఒక్కడురా!

**ఇలాంటి దైవతత్త్వమును ఏనాటికి మరువకూడదు. ఉన్నది ఒకే దైవమనే సత్యాన్ని మనం గుర్తించాలి. నా లోపల, నా వెలుపల నా సర్వత్రా వున్నటువంటిది దైవమే** అనే సత్యాన్ని గుర్తించాలి. దైవము సమష్టి స్వరూపం. దేవము ప్రేమస్వరూపుడు. ప్రపంచమంతా ప్రేమమయమే. ప్రేమదృష్టిని మనం పెంచుకోవాలి. మన జీవితం ప్రేమమయంగా మారుతున్నప్పుడు జగత్తంతా బ్రహ్మమయంగా మారుతుంది.

## దేహభ్రాంతి

అమితముగా దేహభ్రాంతి పెంచుకోరాదు. ఇది నాది అనే మమత్వము, నేను అనే అహంకారము, ఈ రెండే సమస్త అనర్ధములకు మూలకారణము. **దేహభ్రాంతి ఉన్నంత వరకు బ్రహ్మ ప్రాప్తించదు.** దేహభ్రాంతిని క్రమక్రమేణా తగ్గించుకొంటూ రావాలి. దైవముపై వ్యామోహం పెంచుకొంటూ పోవాలి. సమస్త ప్రేమను భగవంతునికే అంకితముచేయాలి.

**త్వమేవ మాతా చ పితా త్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవ దేవ.**



ఎప్పుడు ఈ తత్వాన్ని అభివృద్ధి గావించుకొని దృఢమైన నిర్ణయము చేసుకొంటామో అప్పుడే అనుకున్న ఆనందము లభ్యమవుతుంది. మనసునిండా ఏవో సందేహాలు పెట్టుకుని జీవితాన్ని వ్యర్ధము చేసుకొంటూ చిక్కిన దానిని కూడా దక్కించుకోలేక పోతున్నారు. చిక్కిన దానిని అనుభవించడానికి తగిన కృషి చేయాలి. విరోధులను కూడా ప్రేమించిన, తగిన మార్గములలో వారిని మార్చుకోవటానికి వీలవుతుంది. ప్రేమ సమత్వాన్నీ, సమైక్యతనూ సాధిస్తుంది.

దేహభ్రాంతిని వదలటం ఎట్లా? **దేహభ్రాంతిని వదలడం అంటే అన్నపానాదులు విసర్జించి, శుష్కించి, అస్థిపంజరంగా మరణించటం కాదు. దేహమే నేననేభావము విసర్జించు. నేను దేహము కాదు. ఇది నా ఉపాధి.** దేహేంద్రియ మనోబుద్ధులన్నియు నా ఉపాధులు, నేను ధరించిన ద్రస్తులు. ద్రస్తుల్ని ఏ విధంగా మార్చుకుంటున్నామో, ఏ విధంగా విసర్జిస్తున్నామో అదే విధంగానే ఈ దేహభ్రాంతిని విసర్జించాలి. ఆకలిదప్పులకు సంబంధించిన ఆహార నియమములు పాటించాలి.

**ఆనందమనే నిధికి ఒక భద్రత ఏర్పడింది. దీనిని అహంకారమనే సర్పము నిర్విరామంగా తిరుగుతూ కాపాడుతుంది. దానిదగ్గరికి ఎవ్వరూ పోలేక పోతున్నారు. ఎవడు ఈ అహంకారమనే సర్పమును నిర్మూలము గావించునో వానికే ఈ ఆనందమనే** నిధి లభ్యమౌతుంది. అహంకారము అజ్ఞానము చేత ఆవరించినట్టిదే. ఈ అహంకారమునకు కారణమేమిటి? ధనమా? బలమా? స్థానమా? అధికారమా? విద్యనా? ఇవి ఏవీ కారణం కాదు. ఇవన్నీ అల్పమైన శక్తులు. **దేహభ్రాంతియే దీనికి మూలకారణము.** ఇవన్నీ ఎంత కాలము? అందుకోసమే శంకరాచార్యులు **"మాకురుధన జన యౌవనగర్వం హరతినిమేషాత్కాల సర్వం"** అన్నారు. ఇవి క్షణములో మార్పుచెందుతాయి. ఇవన్నీ అనుభవించిన వ్యక్తులు స్థిరంగా ఎక్కడున్నారు? గొప్ప గొప్ప పదవులనంతా ఏలి సిరిసంపదలను అనుభవించి ప్రఖ్యాతిని పొంది, రారాజులుగా, చక్రవర్తులుగా ఉండిన వ్యక్తులంతా ఎక్కడున్నారిప్పుడు? వారున్నారా? లేక వారి స్థానములున్నాయా? వారి ధనముందా? ఏదీ లేదు. ప్రాచీన కాలము నుండి భారతదేశమునందు అనేకమంది అనేక రకములైన సాధనలు సలిపి

ఇవన్నియును అనిత్యమని లోకానికి చాటుతూ వచ్చారు. అదే భగవద్గీతకూడను **"అనిత్యం అసుఖం లోకం"** అని చాటింది.

## మలము

మలమనగా ఏమిటి? మన జీవితములో తెలిసియో తెలియకనో అనేక విధములైన దోషములు చేస్తున్నాము. ఈ జన్మమునందే కాదు. ప్రతిజన్మము నుండి అనేక తరములనుండి మనము దోషములు ఆచరిస్తూ వస్తున్నాము. ఈ దోషముల మాలిన్యము తరతరముల నుండి మార్పు చెందక చిత్రముపైన చిత్రింపబడుతూ వచ్చింది. అద్దముపైన మాలిన్యముండినపుడు మన స్వరూపము స్పష్టంగా గోచరము కాదు. ఈ కారణముచే మానవుడు తన స్వస్వరూపమును దర్శించలేకపోతున్నాడు; గుర్తించలేకపోతున్నాడు; మనస్సనే అద్దము నందు తన నిజస్వరూపాన్ని చూడలేక పోతున్నాడు. కనుక ఈ అద్దమునకు చేరిన మాలిన్యాన్ని శుద్ధపరచటానికి తగిన కృషి చెయ్యాలి. ఏవిధముగా చెయ్యాలి? చేసే ఉపాయము ఏమిటి? దీనిని మానవుని **ఆహారవిహారముల చేత పరిశుద్ధము గావించుకోవచ్చు Past is past గడచి పోయినది గడచిపోయినది; వర్తమానమందైనా పవిత్రమైన మార్గమును అనుసరించి దీనిని పరిశుద్ధపరచే ప్రయత్నమునకు పూనుకోవాలి.**

## మానవరూపము – విశిష్టత

**మానవరూపములో దివ్యశక్తి 80 శాతము వరకు యుండుటయే దాని విశిష్టత, అద్వితీయత. జంతువునందు ఆ శక్తి 15 శాతమే ఉండును. మానవుడు దివ్య పరివర్తనను సాధించి భగవంతునిలో ఐక్యము కాగలడు; జంతువు తన సహజ స్వభావము నుండి ఎన్నటికీ బయటపడలేదు.** ఉదాహరణకు – ఒక పిల్లికి ఎంత మంచి ఆహార పదార్థములను పెట్టినా, ఎలుకను చూచిన వెంటనే, ఆ ఆహారమును వదలి ఎట్టి అది ఎలుక కొరకు పరుగెత్తును. ఒక పులికి ఎంత శిక్షణ నిచ్చినా గింజలతో తయారుచేసిన ఆహారము దానికి రుచింపదు. సంతృప్తిని కలిగింపదు. పులికి సహజమైన ప్రేరణ మృగములను చంపి మృత శరీరములను భక్షించుట.



## మానవునిలో పాపభీతి నశించింది

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దానిబట్టి
మానవత్వ మణగె మానవులందున
విశ్వశాంతి కిదియె విప్లవంబు.

ఈనాడు మానవులలో పాపభీతిగాని, దైవప్రీతిగాని లేకపోవడంచేతనే విశ్వశాంతికి ముప్పు ఏర్పడింది. ఈనాటి మానవ జీవితము తినటం, త్రాగటం, నిద్రించటం సుఖించటం – వీటికి మాత్రమే పరిమితమవుతున్నది. **ఇదేనా మానవ జీవితం? "జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః",** జ్ఞానహీనుడు పశువుతో సమానం. పశువులు, మృగములు కూడా తింటున్నాయి. త్రాగుతున్నాయి, నిద్రిస్తున్నాయి. సుఖిస్తున్నాయి. అయితే, వాటిలో దాచుకునే స్వార్థంగాని, దోచుకునే దౌర్భాగ్యంగాని లేవు. **దాచుకోవటం, దోచుకోవటం మానవునియందే కనిపిస్తున్నాయి. మానవుడని పేరు పెట్టుకొని మృగములలో కూడా లేని అవలక్షణాలను పెంచుకోవటం ఎంత దోషం!** ఈనాడు మానవుని ఆశలకు అంతు లేకుండా పోతున్నది. కోరికలు చీమల పుట్ట వలె పెరిగిపోతున్నాయి. మానవ జీవితం దీర్ఘ ప్రయాణం. ఇందులో కోరికలనే లగేజిని ఎంత తగ్గించుకుంటే ప్రయాణం అంత హాయిగా సాగుతుంది. కోరికలను తగ్గించుకుని ఈ దీర్ఘ ప్రయాణాన్ని దివ్య జీవితంగా గడపాలిగాని, దీన జీవితంగా గడపకూడదు.

## మానవుని పరిస్థితి

మానవాళి కంటె సృష్టి చాల విశాలమైనది. ఈ సృష్టికి మానవత్వమునకు సన్నిహిత సంబంధమున్నది. తల్లిపాలు బిడ్డ త్రాగినట్లుగా, పూవులోని మకరందమును తుమ్మెద గ్రోలినట్లుగా ప్రకృతిలోని వనరులను మానవుడు అనుభవించటంలో ఎట్టి అభ్యంతరమూ లేదు. **కాని ఈనాటి మానవుడు మితిమీరిన ఆశలచేత ప్రకృతి వనరులను దుర్వినియోగం చేస్తున్నాడు. అందుచేతనే ప్రకృతిలోని బ్యాలన్సు తప్పిపోయి భూకంపములు, ఉప్పెనలు, కరవు కాటకముల వంటి ప్రకృతి వైపరీత్యాలు**

సంభవిస్తున్నాయి. తాను కూర్చున్నటువంటి కొమ్మను తానే నరుక్కుంటున్నట్లుగా ఉన్నది ఈనాటి మానవుని పరిస్థితి.

## చతుష్పాద మహాసభ

నిజముగా మానవుడు భయస్వరూపుడు కాదు. మానవత్వమనే పదమునందే దివ్యత్వమనే అర్థము ఇమిడి వుంది. దీనికి ఒక చిన్న కథ. ఒక భయంకరమైన అరణ్యములో సర్వవిధములైన జంతువులు నివసిస్తూవుండేవి. ఏ అడవిలో సింహములు నివసిస్తాయో ఆ అడవిలో ఏనుగులు నివసించవు. ఏనుగులు సంచరిస్తూ వుండే అడవిలో సింహములుండవు. కాని ఈ అడవియందు సింహము మొదలుకొని నక్క కుక్క వరకు సమస్త ప్రాణులు సంచరిస్తూవున్నాయి. ఒక నక్క అనేకవిధములుగా యోచిస్తూ వచ్చింది. **మానవత్వమును ఆదర్శజీవితముగా లోకులు భావిస్తున్నారు. మానవజన్మము చాలా దుర్లభమైనదని చెప్పుకుంటున్నారు. మానవుడు పుట్టినట్లుగానే జంతువులు కూడా పుట్టినాయి. తల్లి గర్భమునుండి జన్మించిన ప్రతిదీ ఒకవిధమైన జంతువే. మానవునికి కూడను జంతువు అని పేరు పెట్టకుండా మానవుడనే పేరు ఎందుకు పెట్టారు?** మాకంటె తాను యేమంత గొప్పవాడు? వారికంటె మేము యేమి తీసిపోయినవారము? ఈవిధముగా తర్జనభర్జన చేసుకొని విచారణ సల్పి యిది వూరికే విడిచి పెడితే ప్రయోజనము లేదు దీనిని సాధించాలి అని ఆ నక్క గట్టిపట్టు పట్టింది.

ఆనాటి నుండి నక్క కాన్వాసింగ్‌కు బయలుదేరింది. ప్రతి జంతువు దగ్గరకు వెళ్లింది. మానవునికంటె మనము యెందుకు తక్కువగా వుండాలి? **జంతుజాతి మానవజాతికంటె హీనజాతియని భావిస్తున్నారు. ఈ పేరును మనము తుడిచివేసుకోవాలి అని బోధిస్తూ ప్రతీ జంతువుకు ఉద్రేకమును ఉత్సాహమును చేకూరుస్తూ వచ్చింది.** శరీరపుష్టి గల ఏనుగు మొదలుకొని మృగరాజైన సింహము, హీనస్థాయి యందున్న నక్క కుక్కల వరకు దీనిని టాంటాం వేయించి అందరికీ ఈ విషయమును బోధించింది. అందరూ చేరి ఒక మహాసభను యేర్పరచుకోవాలని నిర్ణయం జరిగింది. సభకు 'చతుష్పాద మహాసభ' యని పేరు పెట్టుకున్నారు. ఫలాని కాలములో ఫలాని



సమయానికి అందరూ ఈ మహాసభలో పాల్గొనాలని చెప్పింది. దీనికి ఎజెండా మూడు విషయాలు నిర్ణయము చేసుకుంది. **మానవులు జంతువులు తల్లి గర్భమునుండి పుట్టినవారే. అందుచే మానవులకు జంతువులకు 'జంతువు' అని ఒకే పేరు వుండాలి.** రెండు పేర్లు ఉండటానికి వీలులేదు. **జంతువులకు మానవుడు అనైనా పేరుండాలి. లేదా మానవునకు జంతువు అనైనా పేరుండాలి.** ఈ రెండు సమానములు; భిన్నముగా వుండటానికి వీలుకాదు అని నిర్ణయము చేసుకోవాలి. **ఇక రెండవది మానవుడు జ్ఞానవంతుడని, జంతువులు అజ్ఞానముతో కూడినవని మనకొక చెడ్డ పేరు. దీనిని మనము అంగీకరించరాదు.** మనకున్న జ్ఞానముకంటె మానవునికి యేమంత అధికముగా వుంటుండాది? మానవునకున్న జ్ఞానముకంటె మనకేమి తక్కువగా వుంటుండాది? ఇరువురికీ ఒకే జ్ఞానము అనే దానిని మనము స్థిరము చేసుకోవాలి. **ఇక మూడవది మనము నోరులేని వారమని, మానవుడు నోరున్నవాడని, మనము మూగజంతువులమని, వారు మాటకారులని పేరు ప్రతిష్ఠలు కలిగినాయి.** మనం మూగజంతువులమైనప్పటికీ మనకు యేమి కొరతగా వున్నది? మాటలు నేర్చినవాడైనప్పటికిని వాడేమి సుఖమును అనుభవిస్తున్నాడు? కనుక మాటలకు, మూగతనమునకు యే మాత్రము భేదము వుండకుండా చూచుకోవాలి. **మనము క్రూరులమని భావిస్తున్నారు. మానవుడు తాను సాత్వికుడని విశ్వసిస్తున్నాడు. దీనికి మనము అంగీకరించరాదు.** మనలో వున్న సాత్వికత్వము మానవులెవరియందు కూడ లేదు. మానవునికంటె మృగము సాత్వికమైనదనే సత్కీర్తిని మనము తీసుకురావాలి. ఇప్పుడు చెప్పిన నాలుగు పాయింట్లు మనము ఈ సమావేశము లోపల చర్చించాలి. ఈ మీటింగుకు ఎవరిని అధ్యక్షుని చేయాలి? అప్పుడే నక్కనే చెప్పింది. మన అడవి లోపల కొంతమంది యోగులు, ఋషులు తపస్సు ఆచరించుకుంటున్నారు. అందులో ఉత్తముడైన ఒక ఋషిని మనం ఆహ్వానిద్దాము అని విశ్వసించి నక్కనే ఆ ఋషి దగ్గరకు వెళ్ళింది. స్వామీ! **మా జంతురాజ్యములో చతుష్పాదమహాసభ యనే గొప్ప సభను జరుపుకుంటున్నాము.** తమరు దీనికి అధ్యక్షత వహించాలి అని కోరింది. **సర్వభూత సమానత్వమును గుర్తించిన ఆ యోగి మీ సభకు తప్పక వస్తానని అంగీకరించాడు.**

మంచి ముహూర్తములో ఆ సభను ప్రారంభించుకున్నారు. విశాలమైన ఒక ప్రదేశములో ఆనాడు అడవిలో వున్న చిన్న జంతువు మొదలుకొని పెద్ద జంతువు వరకు తల్లిదండ్రులు మొదలుకొని మునిమనుమలు వరకును అన్నీ ప్రయాణమై వచ్చినాయి. అక్కడ కళకళలాడుతుండాయి. కిలకిలా నవ్వుతున్నాయి. ఈ మృగములంతా కూడను అధ్యక్షునిపై కొంతవరకు విశ్వాసమున్నవే, కనుక ఆ ఋషికి ఉన్నతాసనమును ఏర్పరచినాయి. అదే విధముగా అధ్యక్షుని పక్కన సింహమునకు ఉన్నత స్థానము అమర్చినాయి. మహర్షి తన ప్రక్కనున్న సింహమును చూచి యేమాత్రము అదరలేదు. బెదరలేదు. సర్వభూతములందుండిన దైవత్వమనే ఏకత్వమును కలిగినవాడు ఈ మహర్షి. ఈతని యందు అభయత్వమే వుందిగాని భయత్వము లేదు. అందరూ కూర్చున్న తరువాత స్వాగతం చెప్పాలి. ఈ మహాసభకు సెక్రట్రీ ఈ నక్కనే కనుక ఇట్లా ప్రారంభించింది. "ఈనాడు మనకందరికి సువర్ణాక్షరములతో లిఖించవలసిన దినము. ఇది మరువరానటువంటి దినము. మన అందరి సమావేశము ఒక దిగ్విజయమును సాధించబోతుంది. మీకు యెన్నో పనులున్నప్పటికినీ అన్నియును వదలి ఈ సమావేశములో పాల్గొన్నారు. మీ అందరికి నా ధన్యవాదములు" అంది తరువాత మీటింగ్ యొక్క మూడు విషయాల ఎజండాను చెప్పింది.

ఎజెండాను చెప్పిన తరువాత సింహరాజు లేచాడు. లేచి "నా సోదరుడైన నక్క చెప్పిన విషయము మీరంతా విన్నారు. నిజముగా మన జంతువులయందుండే శౌర్య సాహసములు, ధైర్యము, పటుత్వము మానవునియందు లేవు. దీనికి నేను ప్రత్యక్ష ప్రమాణము. నాయందున్న ధైర్యము, బలము మానవునిలో యేఒక్కరికైనా వుంటుందా చూపించండి. నేను మృగరాజునైనప్పటికీ అన్యాయ అక్రమ అనాచారములలో యే మాత్రము అడుగుపెట్టలేదు. నిష్కారణముగా పరజీవులను హింసించటము లేదు. ఆకలైనప్పుడు మాత్రము యేదో ఆహారమును భుజిస్తాను. వ్యర్థముగా నేను యే ప్రాణినీ తినటం లేదు. ఈ ధైర్యము, ఈ సాహసము, ఈ నీతి మానవుని యందు వుందా? లేదు. కనుక మనము మానవులకు ఎందుకు వెరవాలి? అతనికంటె అల్పజాతి అని మనము ఎందుకు అన్పించుకోవాలి? దీనిని ఈనాడు నిర్ణయం చేసుకోవాలి" అంది. తరువాత ప్రక్కనున్న ఏనుగు లేచింది. "మానవుడంటే నామోకాలంత కూడ



లేడు. ఆకారములో నాది గొప్ప ఆకారము. తెలివితేటలలో నాది గజతెలివి అనిపించుకున్నాను. నన్ను రాజులు, రారాజులు విశ్వసిస్తూ అన్వేషిస్తూ వచ్చారు. రాజుకు పట్టాభిషేకము చేసే సమయములో నేను లేకపోతే పట్టాభిషేకము జరుగదు. నాకంటె మానవులు గొప్పవారిని నేను ఎట్లా చెప్పాలి. నా తెలివితేటలకు నా బలమునకు నాయొక్క ఆకారమునకు మానవుడేనాటికి సాటిరాడు" అన్నది.

అంతలో నక్క ఒక యోచన చేసింది. మృగరాజు లేచి చెప్పాడు. ఆ మహారాజు ప్రక్కనున్న మంత్రి సమానమైన ఏనుగు లేచి చెప్పింది. చిన్నవాడు ఒకనిని పైకి లేపి మాట్లాడించాలి అనుకుంది. పక్కనున్న అడవికుక్కను లేపింది. అడవికుక్క లేచి అధ్యక్షునికి నమస్కరించి, మృగరాజుకు నమస్కరించి, సమావేశములో చేరిన వారందరికీ నమస్కరించి, "గొప్పవారిముందు అల్పుడను, నేను మాట్లాడవలసి వచ్చిందిగాని నా యల్పత్వమునందుండిన మహాగుణము మానవునియందులేదు. విశ్వాసములో నాకు మించినవాడు మరొకడు లేదు. నన్ను సాకి సంరక్షించిన వానిపైన నేను యెంతో విశ్వాసమును పెంచుకుంటాను. నా ప్రాణము పోయేంతవరకు వానికి కృతజ్ఞుడైవుంటాను. నన్ను హింసించినప్పటికినీ నేను అతనిని యే మాత్రము బాధించను. మానవలోకమునందు కూడను "కుక్కకున్న విశ్వాసము నీకు లేదురా" యని అంటుంటారు. మానవుడు తన మాష్టర్ని హింసించటానికి ప్రయత్నిస్తాడు. ఉపకారము చేసినవానికే అపకారము చేస్తున్నాడు. తనకు అన్ని విధములుగా సహాయము చేసినవానికే ద్రోహం చేసి దూషిస్తున్నాడు మానవుడు. తన యజమానిపై కుట్రపన్ని హింసకు పాల్పడుతున్నాడు మానవుడు. మానవునికి కృతజ్ఞత అనేది లేదు. విశ్వాసము కూడనులేదు. తన అక్కర తీరేంతవరకు యెంతైనా వినయవిధేయతలు ప్రదర్శిస్తాడు. తన అక్కర తీరిన తరువాత మాస్టర్నే హింసించటానికి పూనుకుంటాడు. మానవునికంటె మనమే మాత్రము తక్కువజాతి వారముకాము" అన్నది. ఈ విధముగా మిగతా జంతువులు వాటి వాటికి తగినట్లుగా ఉపన్యాసాలిచ్చినవి. తరువాత అధ్యక్షుని ఉపన్యాసము వచ్చింది.

ఆ ఋషి చెప్పాడు "ఓ మృగములారా! మీరు చెప్పిన విషయములన్నియు సత్యములే. కూరిమి గల దినములలో నేరములెన్నడును కలుగనేరవు" ఇష్టంగా ఉండే రోజుల్లో

మాస్టర్ చేసేవి అన్నీ మంచివే అనుకుంటాము. "కూరిమి విరసంబైనను నేరములే తోచుచుండు". ఈ మాస్టర్ పైన యేమైనా కొంచెము అయిష్టము బయలుదేరిన అతను మంచిపని చేసినా చెడ్డగా భావించుకుంటాము. **మానవుడు, ఎదురుగా నమస్కరిస్తాడు. మరుగునపోయి దూషిస్తాడు. ఎదురున ఒకమాట, మరుగున ఒకమాట.** ఎదురుగా వర్ణించి వెనుకగా పోయి హతమార్చటానికి ప్రయత్నిస్తాడు. ఇలాంటి తెలివితేటలకంటె మృగము చెప్పిన తెలివితేటలు చాలా గొప్పవి. మీరు చెప్పిన దోషములు మానవునియందు లేకపోలేదు. **ఆహారనిద్రాభయమైథునేచ్ఛలు నాల్గింటియందును మృగమునకు మానవునకు ఎట్టి వ్యత్యాసము లేదు. అయితే జంతువులకంటె మానవుని యందు ప్రత్యేకత ఒకటి వున్నది. మృగములయందు పుట్టుకతో వచ్చిన క్రూరత్వమును మృగములు మార్చుకొనలేవు.** ఎంత **ఆకలి గొన్నప్పటికి పులి పూరీ పలావు తినదు. పులి మాంసాన్నే అరగిస్తుంది. టిఫిన్, కాఫీలు త్రాగదు.** ఎంత ప్రయత్నము చేసినప్పటికి దాని స్వభావము మారటానికి వీలుకాదు. మానవుడు ప్రయత్నము చేస్తే ఎటువంటి క్రూరత్వమును గాని, ఎటువంటి దుర్గుణములుగాని మార్చుకొనగలడు. ప్రయత్నముచేత పరివర్తన కలిగే **శక్తి మానవునియందువుంది. ఎట్టి ప్రయత్నము చేసినప్పటికినీ మృగమునందు పరివర్తన కలిగే శక్తిలేదు. ఇదే రెండింటికి భేదము. ఈ విధమైన శక్తి సామర్థ్యములు మనిషి యందుంటున్నవి"** అన్నాడు. అప్పుడు నక్క లేచి 'స్వామీ! మీరు చెప్పినది వాస్తవమే. అయితే అలాంటి మార్చుకొనే శక్తిమానవుని యందుండినప్పటికినీ మార్చుకోలేని మానవుడు ఎలాంటివాడు?' అన్నది. "శక్తి వుండి కూడా **అలామార్చుకోలేని మానవుడు మృగము కంటే హీనము" అన్నాడు అధ్యక్షుడు.** అప్పుడు అన్ని మృగములు చప్పట్లు కొట్టాయి. **మానవునియందు వివేకశక్తి వుండినప్పటికీ వినియోగించక సన్మార్గములో ప్రవేశించకుండా వుండే మానవుడు మృగము కంటే హీనము అని మహర్షి నిర్ణయించాడు.**

"ఇంక మానవుడు చదువు సంధ్యలలోపల మహా గొప్పవాడుగా ఉంటున్నాడు. చదువులు చదివినందువలన కల్గిన ఫలితమేమి? ఇవి కేవలము పొట్టకూటికోసమేకదా! ఆ పొట్టను మనము కూడా నింపుకుంటున్నాము కదా. పొట్టను నింపుకునే నిమిత్తమై మానవుడు ఇన్ని విధములైన శ్రమలు పడుతున్నాడు. **శ్రమ పడకుండా మనము**



పొట్ట నింపుకుంటున్నాము. వారికంటె మనమే గొప్ప" అన్నది నక్క. నక్క మాటలు మరీ మితిమీరిపోతున్న సమయంలో **అధ్యక్షుడైన మహర్షి** దానిని నివారించి రెండవ **భేదము చెబుతూ వచ్చాడు.** "మానవుడు మాయను సాధించగలడు. మానవుడు **ఆత్మను చూడగలడు. మానవుడు నిర్వాణమనే ఆనందమును చేరగలడు. మానవుడు మాయను జయించే అధికారము వుంటుండాది. ప్రయత్నముచేసి ఆత్మను ఉద్ధరించుకో గలడు. సాధనసంపత్తివలన నిర్వాణమును చేరగలడు. ఈమూడు మీ మృగముల యందులేవు"** అన్నాడు. **ఆ మహర్షి ఇంకా చెప్పాడు. 'నాయనా! ఆంగ్లభాషలోపల MAN అని చెబుతున్నారు. తెలుగులో మానవ అని చెబుతున్నారు. మాయనే ఆజ్ఞానమును దూరముచేసుకొని ఆత్మతత్వమును దర్శించి విజ్ఞానమనే ఆనందములో లీనమవుతాడు మానవుడు.** అదే అర్థము ఈ MAN లోపల వుంది. **M** అనగా మాయ. **మాయను తొలగించు. A అనగా ఆత్మ. ఆత్మను దర్శించు. N అనగా నిర్వాణము. నిర్వాణము పొందుము. ఆనందములో లీనము కావాలి. అజ్ఞానమును దూరము చేసుకొని ఆత్మను దర్శించి ఆనందములో లీనము అయ్యేవాడు నిజమైనవాడు'** అని చెప్పాడు. మృగములన్నియు తలలు వంచుకున్నాయి. అది తమకు చేతకానిపని యని ఒప్పుకున్నాయి. అయితే అందరు మానవులు ఈ పని చేయగలుగుతున్నారా? **ఈ విధమైన ప్రయత్నము చేయని మానవుడు మా Friend అని మృగములన్నీ అంగీకరించాయి. కనుక మానవునకు మృగమునకు ఎక్కువ వ్యత్యాసము లేదు. మానవునియందు విజ్ఞాన ప్రజ్ఞాన సుజ్ఞానములు వుండి కూడను సరియైన రీతిలో అనుభవించుట లేదు. మహర్షి తాను అరణ్యమునకు వచ్చిన కారణమును నిరూపించాడు. మృగములు తమను హింసించినవానిని మాత్రమే హింసించగలవు. తమను హింసించని జోలికి ఏమాత్రము పోవు. కాని మానవుడు తనను హింసించని వానిపైన కూడ హింసకు ప్రయత్నము చేస్తాడు. నిష్కారణమైన నిందలు మోపుతాడు. నిరపరాధులను హింసిస్తాడు. కారణములేని కార్యములో పాల్గొంటాడు. కనుకనే ఆ మానవులనుండి దూరముగా ఈ సాత్వికగుణము కల్గిన మృగముల మధ్య సుఖముగా జీవించగలమని ఋషులంతా అరణ్యమునకు వస్తున్నారు. మానవుడు కేవలము స్వార్థపరుడైపోతున్నాడు.** ఏది చేసినా, ఏది చూసినా, ఏది చెప్పినా తన **స్వార్థమునందే**

మునుగుతున్నాడు. మృగమున కేమాత్రము స్వార్థము లేదు. ఈ మృగములు మనుమలను మునిమనుమలను ఆమెరికాకు, జపానుకు, ఫ్రాన్సుకు, ఇటలీకి, జర్మనీకి పంపించాలని డబ్బు బ్యాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేయటం లేదు. మోసగించి, పరులను హింసించి, పరులను బాధించి తమ పొట్టను నింపుకోవటము లేదు. కొంపలు కట్టుకోవటం లేదు. మానవుడు కూడను ఒక జంతువుతో సమానమే" అని ఒక నిర్ణయం చేసుకున్నాయి.

**కృష్ణుడు అర్జునిని, "నాయనా! భయపడే గొఱ్ఱె కాదు నీవు. భయపెట్టే పులికాదు నీవు. నీవు గొఱ్ఱె కాదు. పులీ కాదు. నీవు మానవుడవు. మానవునియందు ఈ మృగత్వము శేషించి వుండిపోవటము వలననే మానవుడు ఈవిధమైన ప్రవర్తనకు గురి అవుతున్నాడు. కనుక నీవు అభయుడవుకమ్ము. భయుడవు కాకూడదు"** అన్నాడు. **అప్పుడు అర్జునుడు "కరిష్యే వచనం తవ" స్వామీ! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను అన్నాడు.**

## మానవజీవితమును వర్ణిస్తూ భగవాన్ ఇలా అన్నారు

ప్రేమస్వరూపులారా! మీరు ఎన్ని విద్యలు నేర్చినప్పటికీ ఆత్మతత్త్వమును అర్థం చేసుకొనకపోతే అన్నీ వ్యర్థమే. సంపాదన ప్రధానం కాదు. ఉద్యోగం స్థిరం కాదు. అయితే, ఉన్నంత వరకు ఇవన్నీ చేయవలసినవే. కానీ, ఇవే ప్రధానమని భావించకూడదు. విద్య యొక్క పవిత్రతను, విద్యయొక్క పరమావధిని అర్థం చేసుకోవాలి. **మీరు నేర్చిన విద్యలను సమాజమునకు అర్పితంగావించి,** సమాజ **సంక్షేమమునకు కృషి చేసి జీవితాన్ని సార్థకం గావించుకోవాలి.** ఈనాడు సమాజ సంక్షేమాన్ని ఆశించేవారు లేకపోలేదు. "జగతియందు పుణ్యపురుషులు లేకున్న జగములెట్లు వెలుగు పగలుగాను" కానీ, అలాంటి మహనీయులు చాల అరుదుగా ఉన్నారు. భగవంతుడు ప్రేమస్వరూపుడు, ప్రేమమయుడు. కనుక, **భగవంతుణ్ణి పొందాలనుకుంటే** ప్రేమనే మీ జీవితానికి పునాదిగా తీసుకోవాలి. బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలకు తగిన భద్రత నిచ్చేది ప్రేమయే. **"సత్యం బ్రూయాత్" (సత్యము చెప్పవలయును) "ప్రియం బ్రూయాత్" (ప్రియము పలుకవలయును) న**



**బ్రూయాత్, సత్య మప్రియం (సత్యమయినను అప్రియమగుచో చెప్పరాదు) ఇవే నైతిక ధార్మిక ఆధ్యాత్మిక విలువలు. ఈ మూడింటి ఏకత్వమే మానవ జీవితము. మొట్టమొదట మానవ జీవితాన్ని చక్కగా అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్నవాడు కాలాన్ని వ్యర్థం చేయడు.**

**మానవ జీవితమనే బండిలో ప్రయాణం చేసే ప్రయాణికుడే ఆత్మ. ఆ బండిని నడిపే డ్రైవరు బుద్ధి. ఆ బండిని లాగేవి ఇంద్రియములు. వాటికి పగ్గములు వివేకవైరాగ్యములు. ఆ బండికున్న చక్రములు ఒకటి కాలచక్రము, మరొకటి కర్మచక్రము. ఆ చక్రముల కున్న ఆకులే ధర్మనియమములు. వాటి చుట్టూ ఉన్న వర్తులాకారమే ప్రేమ. ఇరుసు సత్యము. ఇక చేరవలసిన లక్ష్యము శాంతి!**

**ఈనాడు మీరు రక్షించవలసినది దేశాన్ని కాదు. సత్యధర్మాలను రక్షించాలి. అనుసరించాలి. అవే దేశాన్ని రక్షిస్తాయి.** ప్రేమను పెంచుకోవాలి. సర్వులను ప్రేమించాలి. సర్వులను సేవించాలి. **కుల, మత, జాతి బేధములను త్యజించి, దైవ పితృత్వమును,** మానవ సౌభ్రాతృత్వమును ప్రగాఢంగా విశ్వసించాలి. సోమరితనమును విసర్జించాలి. సమాజ సేవ **చేయాలి.** మీకు క్షేమాన్ని, సౌఖ్యాన్ని సదుపాయాల్ని సౌకర్యాల్ని సమకూర్చిన సమాజం పట్ల కృతజ్ఞతను ప్రకటించాలి. **మానవతా విలువలను పోషించుకుని మాధవత్వమును అందుకునే ప్రయత్నం చేయాలి. దైవం** నుండి ఆవిర్భవించిన మానవుడు దైవం యొక్క గుణములనే కలిగియుండాలి. **"నేను మానవుడను" అని మీరు చెప్పుకుంటున్నారు. కానీ, ఇది పూర్తి సత్యంలో అర్ధభాగం మాత్రమే. "నేను పశువును కాదు" అనేదే మిగిలిన అర్ధసత్యం.** మనిషి లక్షణాలు పశు లక్షణాలు రెండింటితో కూడిన మనస్సు చంచలంగా ఉంటుంది. చంచలమైన మనస్సు గలవాడు సగం గ్రుడ్డివానితో సమానం.

**మానవత్వంలోని దివ్యత్వమును, భిన్నత్వంలోని ఏకత్వమును గుర్తించి అనుభవించాలి. అందు నిమిత్తమే భగవంతుడు మీకు ఈ దివ్యమైన భవ్యమైన, నవ్యమైన మానవ జీవితాన్ని అనుగ్రహించాడు. నీతిలేని వాణిజ్యము, సిద్ధాంతము లేని రాజకీయము, మానవత్వము లేని శాస్త్ర పరిజ్ఞానము, శీలములేని విద్య నిరర్థకము, అనర్థదాయకము.** మానవ జాతికి నీతి, నిజాయితీలు ప్రధానమైనవి. **జాతి గౌరవం నీతిపై నిలుచును;**

నీతి లేకయున్న జాతి చెడును. నీతి కలిగిన జాతియే నిజమైన జాతి. నీతి లేనివాడు కోతికంటే హీనుడు.

ముఖ్యంగా మీరు గుర్తుంచుకోవలసిన విషయాలు మూడు – లోకాన్ని నమ్మవద్దు, దైవాన్ని మరువవద్దు, మృత్యువుకు వెఱువవద్దు. త్రికరణ శుద్ధిని, పవిత్రతను పెంచుకోండి. కోరికలను తగ్గించుకోండి. తృప్తిగలవాడే అందరికంటే ధనవంతుడు. మితిమీరిన కోరికలు గలవాడే అందరికంటే బీదవాడు. అణాలు ముఖ్యం కాదు, గుణాలు ముఖ్యం. జీవిత గమ్యాన్ని గుర్తుంచుకుని ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి. ఆహార, నిద్ర, భయ, మైథునాదులు పశుపక్ష్యాదులకు కూడా ఉన్నవి. మానవులైన మీరు కూడా వీటికే పరిమితమైతే ఇంక మీకు, పశుపక్ష్యాదులకు తేడా ఏముంటుంది. ఈనాడు ముఖ్యంగా మీరు చేయవలసింది మరొకటి ఉన్నది – నోరు మూసుకోండి; హృదయాన్ని తెరుచుకోండి; సమాజ సేవకు మీ శరీరాన్ని అంకితం చేయండి; మీ లక్ష్యాన్ని దైవంపై ఉంచండి. తలలో ఆధ్యాత్మిక చింతన ఉండాలి. చేతులతో సేవ చేయాలి. గ్రామసేవయే రామసేవ. మానవసేవయే మాధవ సేవ. పల్లె ప్రజలకు పారిశుద్ధ్యమును గురించి, ఆరోగ్యమును గురించి వివరించండి. వారికి వైద్యసేవల నందించండి. నీటి సౌకర్యాన్ని కల్పించండి. దరిద్ర నారాయణ సేవ సల్పండి. వారు దుర్భ్యాసములను విడనాడేటట్లు చేయండి. యజ్ఞ యాగ జప ధ్యాన అర్చనాదులకన్న సేవయే ప్రధానమైనది. అధికమైనది. కనుక, స్వార్థమును విసర్జించి పరార్థములో ప్రవేశించండి. అహంకారము, అసూయ, అభిమానము, మమకారము మున్నగు దుర్గుణాలకు చోటివ్వక వినయము, నిరాడంబరత, విధేయత, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనవంటి సద్గుణాలను పోషించుకోండి. దుర్గుణాలు పులులు, తోడేళ్ళవంటివి, సద్గుణాలు గోవులవంటివి. క్రూరమృగాలు గోవులను బ్రతకనివ్వవు కదా. కనుక మీ హృదయంలో దుర్గుణాలకు చోటివ్వక, మానవతా విలువలను నిర్భయంగా పోషించుకోండి.



## మానవతా విలువలు

మానవతా విలువలలో ప్రధానమైనది. ప్రాణ సమానమైనది ప్రేమ. ప్రేమ లేక సత్య, ధర్మ, శాంతి, అహింసలు ఉండలేవు. ఇట్టి ప్రేమతత్త్వాన్ని మరచిపోవడం చేతనే మానవుడు స్వార్థమునకు లోనై దుఃఖానికి గురి అవుతున్నాడు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను మానవుని పంచ ప్రాణములైన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానములతో పోల్చవచ్చును. మానవుడు తన కష్ట నష్టములను నివారించు కొనవలెనన్న ఈ పంచప్రాణములను పోషించుకోవాలి. కానీ ఈనాడు మానవుడు పలికే పలుకునందు సత్యము సడలిపోతున్నది. మానవుడు వేసే ప్రతి అడుగు అధర్మంలో పడుతున్నది. మానవుని ప్రేమ కేవలం లౌకికమైనదిగా, కృత్రిమమైనదిగా కనిపిస్తున్నది. అందుచేత ఎక్కడ చూసినా శాంతి కనిపించడం లేదు. బుద్ధుడు "అహింస పరమో ధర్మః" అన్నాడు. కానీ ఈనాడు అహింస అనేది కనిపించడం లేదు. ఎక్కడ చూసినా హింసనే, హింసనే! ఈవిధంగా ఈనాటి మానవుడు పంచప్రాణములను కోల్పోయిన శవం మాదిరి తయారైనాడు. ఇలాంటి పరిస్థితులందు మానవునికి శాంతి, సుఖములు ఏరీతిగా లభ్యమౌతాయి? మానవశరీరము ధరించినటువంటి ప్రతివ్యక్తి సత్యాన్ని పాటించాలి. పాలించాలి. అనుసరించాలి. ఇదే మానవతావిలువ యొక్క ప్రధాన విషయము.

## మానవత్వము

సత్యము ధర్మముతో చేరాలి. ధర్మము ప్రేమతో ఉండాలి. ప్రేమ శాంతంతో అనుభవించాలి. ఈ శాంతము అహింసలో ప్రవేశించాలి. అప్పుడే ఇది ఏకత్వమనే దివ్యత్వంగా రూపొందుతుంది. అనేకత్వాన్ని ఏకత్వంగా చేసినప్పుడే ఈ ఏకత్వంలోనే మానవత్వం వస్తుంది. ఇట్టి మానవత్వంలోనే ఏకత్వం సులభంగా ఏర్పడుతుంది. ఈ ఏకత్వంలో స్వచ్ఛత సహజంగా వస్తుంది. ఈ స్వచ్ఛత దివ్యత్వంలో ప్రవేశిస్తుంది. ఏకత్వం, దివ్యత్వం, స్వచ్ఛత మూడింటి సమ్మిళిత స్వరూపం ఈ మానవత్వం. దీనిని పిల్లలకు ఏరీతిగా మనం బోధించాలి? బోధించడానికి ముందు అధ్యాపకులు – బోధకులు – తాము అనుభవించి తమ ఆచరణలో పెట్టినప్పుడు చూచి నేర్చుకోవటం

మరింత సులభమవుతుంది. **అధ్యాపకులు ఒక పుస్తకంగా తయారు కాకూడదు. ఆచరణతో మస్తకాన్ని తయారు చేసుకోవాలి.** మానవత్వ గుణమనే దానిని కేవలం ఒక విషయం మాత్రంగా మనం తీసుకోకూడదు. Information కాదు, Transformation కావాలి. ఈవిధంగా పరివర్తితులై పిల్లలకు చెప్పడానికి ప్రయత్నించాలి. ఈ మానవత్వ గుణములను ఒక బోధనా విషయంగా భావిస్తున్నాము. ఇది ప్రత్యేక బోధనాంశం కాదు. **మానవత్వం - ఇదే మన జీవిత పరమార్గం. శరీరము, మనస్సు ఆత్మల చేరిక ఏర్పడితే ఈ మానవత్వం అలవడుతుంది.** ప్రత్యక్ష పరోక్షములందు కూడా మనం ఏకత్వంగా ప్రవర్తించాలి. ఎక్కడికి వెళ్ళినా మానవత్వ గుణమనేది శరీరాన్ని వెంబడించే నీడ మాదిరిగా ఉండాలి.

పునర్విత్తం పునర్మిత్రం పునర్భార్యా పునర్మహీః,
ఏ తత్సర్వం పునర్లభ్యం నశరీరం పునఃపునః

ప్రేమస్వరూపులైన యువతీయువకులారా,
భావి ప్రపంచపౌరులారా!

ధనము కోల్పోయిన మరల సంపాదించుకోవచ్చు. మిత్రుడు పోయినప్పటికి మరొక మిత్రుని సంపాదించుకోవచ్చు. భార్య పోయినప్పటికి మరొక వివాహమాడ వచ్చును. భూమిని కోల్పోయిన తిరిగి మనము దానిని సంపాదించుకోవచ్చు. **శరీరము పోతే తిరిగి మనము సంపాదించుకోలేము.** అనంత జగత్తులో అఖిల ప్రాణికోటిలో మానవుడు అత్యంత ఉన్నతుడు. మానవుడు ఉత్కృష్టమైనవాడు, సౌజన్య సౌశీల్యముతో కూడినవాడు. ఇట్టి మానవత్వమును కోల్పోయిన ఇంక తిరిగి మనకు లభ్యము కాదు. **నైతికము, ధార్మికము, అధ్యాత్మికము - ఈ మూడింటియొక్క సమ్మిళిత స్వరూపమే మానవత్వము.** కాని, మానవుడీనాడు ఈ మూడింటినీ విస్మరించాడు. మానవత్వమనగా ఎంత పవిత్రమైనదో విచారిస్తే ఈనాటి మానవుడు సిగ్గుపడవలసి వస్తుంది. **సత్యము, ప్రేమ, సహనము, దయ, సానుభూతి ఇత్యాది గుణముల చేత వర్ధిల్లిన ఈ భారత దేశంలో ఈనాడు ఎక్కడ చూసినా నిర్దయ, స్వార్థము, కఠినత్వము ఇత్యాది దుర్గుణములు తాండవమాడుచున్నవి.** ప్రేమ అనేది ఎక్కడా కనిపించడం లేదు. ఈనాడు మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. కాని, ఆయా



మహనీయులు ప్రబోధించిన మంచి విషయాలను భూమిలో పూడ్చి పెడుతున్నారు. ఎందుకీ ఆడంబరాలు? ఎందుకీ నాటకాలు? **విగ్రహములను పూజించడం, ప్రబోధములను విస్మరించడం మానవత్వం కాదు.** మానవునికి మానవునికి మధ్య గల సంబంధ భాంధవ్యాన్ని గుర్తించి వర్తించడమే నిజమైన మానవత్వము. **సత్యాన్వేషణ సలిపి న్యాయమును విచారించి పవిత్రమైన ధర్మమార్గమును ప్రవేశింప చేసేదే మానవత్వము.** మానవుడు సత్యవ్రతుడు, ధర్మపరాయణుడు. న్యాయమే ఇతనికి ఆటపట్టు.

ఆకారము మానవాకారముండవచ్చును. దానవ గుణములచేత ఈ మానవత్వాన్ని మరుగుచేయవచ్చును. ఆకారమును చూచి మానవత్వముగా భ్రమించరాదు. నిజమైన మానవత్వ మనగా: మా-నవ-'మా' అనగా కాదు, 'నవ' అనగా కొత్తది. కొత్తది కానిదే మానవత్వము. దీనికి మరొక అర్థమున్నది. మూడక్షరములతో కూడిన **మా.న.వ.'మా' అనగా అజ్ఞానము 'న' అనగా లేకుండా 'వ' అనగా వర్తించటము, అజ్ఞానము లేకుండా వర్తించేవాడు అనేది సరైన అర్థము.** అజ్ఞానమునకు గురియై అశాంతికి లోనై దివ్యమైన ఆత్మజ్ఞానము లభించాలంటే ఏరీతిగా సాధ్యమవుతుంది? ఈ మానవత్వమనే దివ్యత్వమును మొట్టమొదట అర్థము చేసుకోవాలి. అర్థము చేసుకొనక నానార్థములతో అనర్థములు మాత్రమే ఉంచుకొని యథార్థమును విసర్జించటంచేత సత్యస్వరూపమును గుర్తించటానికి వీలుకాదు.

ఆకుపచ్చ పక్షులన్నీ చిలుకలవలె పలుకునా?
పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా?
పులిచర్మము కప్పినట్టి గాడిద తా పులియగునా?
ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా?

**మానవత్వమనగ మనసు మాట క్రియయు అన్ని ఒక్కటిగానె అతికి యుండు.** "మాటయందు వేరు, పనులయందు వేరు, వచనమందు వేరు" ఈ విధమైన మార్గము అనుసరించినపుడు మానవత్వము ఎట్లా అవుతుంది? అసలు మానవత్వమంటే ఏమిటి? మనసు, మాట, క్రియ అన్ని ఒక్కటిగా అతికియుండుట. మనసువేరు, మాటవేరు, క్రియవేరు అయిన ప్రయోజనమేమి? తలచిన తలపులు, మాటలతో

ఉచ్ఛరించి, ఉచ్ఛరించిన మాటలు క్రియలలో ఆచరించాలి. దీనినే **'మనస్యేకం, వచస్యేకం, కర్మణ్యేకం, మహాత్మనాం' అట్టి మహాత్ముడే రాముడు, 'మనస్యన్యత్, వచస్యన్యత్, కర్మణ్యన్యత్ దురాత్మనాం' అట్టి దురాత్ముడే రావణుడు.** మానవుడు ఆచరించ వలసినటువంటి సత్కర్మలను మనస్సునందుతలంచి, వాక్కులతో ఉచ్ఛరించి, క్రియలలో ఆచరించాలి. ఇట్టి మానవత్వాన్ని మనము పోషించాలి.

**మానవ జీవితం చాల దుర్లభమైనది, చాలా పవిత్రమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. కనుక, శరీరమును ఎన్ని శ్రమలకోర్చియైనా కాపాడుకోవడం మీ కర్తవ్యం. ధన, కనక, వస్తు, వాహనాదులకంటే శరీరమే చాల విలువైనది. ఈ శరీరమును సరియైన మార్గంలో ప్రవేశపెట్టి సార్థకం గావించుకోవాలి.** గడచిన రాత్రి తిరిగి రాదు; సముద్రంలో పరిపూర్ణంగా లీనమైన గంగ ఎంత పిలిచినా వెనుకకు రాదు; బాగా నమిలి మింగిన ఫలము ఎంత ప్రయత్నించినా తిరిగిరాదు. అదేరీతిగా, గడచిపోయిన జీవితాన్ని ఎంత ప్రయత్నించినా తిరిగి సాధించలేము. Men are more valuable than all the wealth of the world. (ప్రపంచములోని సమస్త సంపదల కంటే మానవుడే అత్యంత విలువైనవాడు). ధనానికి, డైమండ్స్‌కి, బంగారానికి, భూమికి ఎవరు విలువనిస్తున్నారు? మానవుడే కదా! అన్నిటికీ తాను విలువ నిస్తున్నాడుగాని, తన విలువను తాను గుర్తించుకోలేకపోతున్నాడు.

విలువలేని ఇనుపపెట్టె ఈ దేహము
పెట్టెలోన నగలు పెట్టినట్లు
దేహమందు ఆత్మదేవుడుండెను సుమా!
సత్యమైనట్టి మాట ఈ సాయిమాట.

**ఈ దేహమునందు విలువైన గుణములను దాచుకొనియున్నాము. దయ, ప్రేమ, సహనము, సానుభూతి, త్యాగము ఇత్యాది మానవతా గుణములు ఉండటంచేతనే మానవత్వానికి గొప్ప విలువ ఏర్పడింది.** కాని, ఈనాటి మానవుడు ఈ మానవతా విలువలంటే ఏమిలో అర్థం చేసుకోలేకపోతున్నాడు. కాలమనే గడియారమునందు సంవత్సరములనే గంటల ముల్లు, నెలలనే నిమిషముల ముల్లు, దినములనే సెకన్ల ముల్లు తిరుగుతూనే ఉన్నవి. ఏ క్షణంలో ఇది 'ఘన్, ఘన్' మని గంటలు కొడుతుందో,



ఎప్పుడీ దేహమును వీడవలసివస్తుందో ఎవ్వరూ గుర్తించుకోలేరు. కనుక, దేహాన్ని సరియైన మార్గంలో వినియోగించుకోవాలి. జీవిత ప్రయాణమునకు దేహమే ప్రధానమైన పనిముట్టు. దీనిని సక్రమంగా ఉపయోగించకున్న, మార్గమధ్యంలో అనేక అవస్థలకు గురి కావలసివస్తుంది. ఈనాటి మానవుడు మానవతా గుణములంటే ఏమిటో, దివ్యత్వమంటే ఏమిటో విచారణ చేయకుండా విలువైన తన శరీరాన్ని స్వార్థ స్వప్రయోజనాలకై దుర్వినియోగపర్చుతున్నాడు. భగవంతుడు మీకు శరీరాన్ని అందించినది మీ స్వార్థ, స్వప్రయోజన నిమిత్తం కాదు. **"పరోపకారార్థ మిదం శరీరం".** కాబట్టి, మిమ్మల్ని మీరు రక్షించుకోవడంతోపాటు తోటి మానవులను కూడా రక్షించడానికి కంకణం కట్టుకోవాలి. పరోపకార నిమిత్తం ప్రాకులాడినప్పుడే మీ స్వార్థంకూడా నెరవేరుతుంది. వ్యాసుడు పద్దెనిమిది పురాణాల సారాన్ని రెండు వాక్యాలలో ఇమిడ్చాడు – **"పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం"** (Help Ever, Hurt Never) కాని ఈనాటి మానవుడు స్వార్థం చేతిలో కీలుబొమ్మగా జీవిస్తున్నాడు. స్వార్థం చేతిలో కీలుబొమ్మగా ఉన్న మానవుడు స్వతంత్రు డెట్లవుతాడు? **స్వార్థాన్ని త్యజించాలి. పరార్థాన్ని వరించాలి. అప్పుడే శరీరం సార్థకమవుతుంది.**

## జన్మసార్థకమార్గము

**ఒకసారి పుట్టిన తరువాత మళ్ళీ ఇంకొక సారి పుట్టకూడదు.** మళ్ళీ పుట్టకుండా ఉండటానికి మనం పుట్టింది. ఇదే మనం తెలుసుకోవలసింది. ఇదే ఆత్మజ్ఞానం. దొంగతనం చేసి పట్టుబడ్డ ఒక వ్యక్తికి పదేళ్ళు కఠిన కారాగార శిక్షపడింది. శిక్ష పూర్తికాగానే జైలు అధికారి, "నిన్ను వదిలివేస్తున్నాం నీ తట్టా బుట్టా మూట గట్టుకొని ఇంటికి వెళ్ళు" అన్నాడట. ఆ దొంగ, "ఇవన్నీ ఎందుకు సార్! అన్నీ ఇక్కడే ఉండనీయండి, రేపే మళ్ళీవస్తాను" అన్నాడట. పదేళ్ళు శిక్ష అనుభవించినా మళ్ళీ జైలుకు రావాలనే ఉందతనికి, దృష్టి దొంగతనం మీదే ఉంది. ఈవిధంగా మనం దొంగలము కారాదు. **ఈ ప్రపంచమనే జైలుకు మళ్ళీ రాకూడదు. అజ్ఞానమే దొంగతనం. అజ్ఞానం నాశనమైతే మళ్ళీ జన్మలేదు. పరమాత్ముని స్మరించాలి. భజించాలి. అదే జన్మసార్థక మార్గం.**

ముక్తి మానవుని జన్మహక్కు. మరచిపోయిన ఈ హక్కును గురువు జ్ఞాపకం చేస్తాడు.

## నిను నీవె ఎరుగుమురా జీవా!

ఈ క్రింద వ్రాసిన "బుఱ్ఱకథ" అర్థము చేసుకో, **చాలవరకు నీవు అనునది ఎవరో బోధపడగలదు.** దాని మూలమున కూడా చాలావరకు **వైరాగ్యము** రాగలదు. ఆపై నేను చెప్పెడి విషయము నీవు అనునది సులభముగా తెలియును. "బుఱ్ఱకథ" కేవలము చదువుటయేకాక పదపదమునకూ అర్థము తెలిసికొని ఆలోచించు; గిర్రున నీ బుఱ్ఱ తిరుగును. విను చక్కగ

1. తై తై తై తై తై బొమ్మా
   దీని తమాషజూడర మాయబొమ్మ
   ఖ్యాతి దీనికి ముందు వెన్కగల
   కథ వివరింతును విను జీవా ॥తై॥
2. మాతృగర్భమున మలమూత్రమ్ముల రోతల నీవు రోదింప
   ప్రీతిగ వీరలు పేరంటమ్ములు చేతు రిదెంతటి
   చిత్రమురా ॥తై॥
3. పుట్టితి, మది గోల్పోయితి, దుర్గతి పట్టితినని నీ వేడువగా
   అట్టెనవ్వుచు నానందించెద రిట్టివీరు నీ కెవరయ్యా ॥తై॥
4. మసిలో మట్టిన మలమూత్రములన్
   మసలుచు సిగ్గనుమాటయె లేక
   పసిపాపడవై పడుచు లేచుచు
   దిన మొక నాటక మాడవాకో
5. తోడివారలతో కూడియాడుచు వేడుకతో పలువిద్దెలు నేర్చుచు
   చూడచూడగ చోద్యపుకళతో ఏడేడునకు ఎదిగే బొమ్మ ॥తై॥
   సతిపతియని సరసభావమున జతజేరుచు సంసారరంగమున
   అతికౌతుకమున నంతకన్న నిక అన్యము లేదని ఆడితిరే ॥తై॥



6. బొమ్మను బొమ్మను పొందుపఱచి పలు
   బొమ్మలు సేయుర బ్రహ్మయ్య
   నమ్ముట వన్నియు నావేయని దిం
   దిమ్మని వానితో నాడుదుగా ॥తై॥
7. ధనము గూర్చునెడ దాచిపెట్టునెడ దానిబెంచ నది చనినపుడున్
   తనువుతోడ నీ మనసుతోడ నీ తాండవ మెన్నగ తరమౌనా ॥తై॥
8. కామము క్రోధము గట్టికోలగా తామసంబు ముకు దాడును గాగన్
   కామినియున్ కనకంబుచేతిలో గంగిరెద్దులై గంతులు వేసే ॥తై॥
9. సాగుచున్నదని లోగినవారిని సంకటపెట్టుటె సంతసమా
   ఈగకాలియంతే వికటించిన నీగతి తైతకలేగాదా ॥తై॥
10. ఉరిమిచూచును కరములూచుచు ఒడలెరుగని శివ మొందుచును
    అరుచు చెగురుచు నందురు నవ్వగ ఆగ్రహ మనుదయ్యము పట్టిన ॥తై॥
11. చదువెందులకను సంగతెమఱచి
    ఉదరపూర్తికే ఉఱుకులెత్తుచు
    ఎదటి గొప్ప సహియింపకేడ్చుచు
    సతమతమయ్యె చదువులబొమ్మ ॥తై॥
12. గుట్టుగ నీ చెడుకోర్కె చెల్లెనని లొట్టలు గొట్టకు రోరన్నా
    చిట్టావ్రాసే చిత్రగుప్తు కండ్లెట్టుల గంతలు గట్టుదురా ॥తై॥
13. అందము ప్రాయము ఇంద్రియశక్తియు
    ఉందని నిక్కకు రోరన్నా
    ముందున్నదిరా తొందరలోనే
    ముసలితనమ్మను ముసుళ్ళపండుగ ॥తై॥
14. మసలలేవు కనుమసకలు మోమున
    మడతలుబడె తల నెరిసెనుగా
    ముసలికోతియని పనివారలు నిన్
    ముసిముసి నవ్వగ కసరు కొనే ఓ ॥తై॥

15. చచ్చుదాక సంసారచింతలో పుచ్చిన లాభము వచ్చేనా
అచ్చుట నీ మయమాతన కడ్డము వచ్చేదేదిరా పిచ్చయ్యా ॥తై॥
బుర్రుమనుచు జీవుండను పిట్ట బొట్టబొమ్మను విడిపోగా
బిర్రుగనీల్గిన కట్టబొమ్మ యిది బర్రున బైటికి పట్టి లాగే ॥తై॥
16. పంచభూతసంభవమౌ మేనిక
పంచత్వము ప్రాప్తించుగదా
వంచితుడై నాదంచు దీనికై
వాంఛగొంచు దుఃఖించే జీవా ॥తై॥
17. బంధువులందరు వాకిటదాకను వల్లకాటికిని వత్తురుగా
బంధమణచి నిన్ బాయని ఆపద్బంధువు భగవన్నామమెరా ॥తై॥
18. నమ్మకొనకు నిత్యమ్మని దేహము
పుట్టిముంచు నిది నట్టేటన్
తుమ్మునంతలో తూలిపోవు నీ
తొమ్మిదితొట్టల తోలుబొమ్మ ॥తై॥
19. ఆపదలన్ సౌఖ్యంబులందున
ఏపుమీరగా ఏడ్చుచు నవ్వుచు
ఆ పరమేశ్వరు నానతి మేఱకు
ఆడే భోగము తాపాబొమ్మ ॥తై॥
20. ధర్మకర్మసూత్రంబుల గొనినన్ దా నాడింపక దైవంబు
మర్మమెరుంగక మాయేటందువు మాధవుచేతి కీలుబొమ్మ ॥తై॥
21. తరతరమును సుస్థిర మనిపించుచు
పరమావస్థలపాలు సేయుచు
మరునిముసం బిది మరుగుపడురా
పరమాత్ముడు సల్పిన మాయబొమ్మ ॥తై॥
22. చెట్టైపుట్టై చీమై దోమై చిలుకై కొండచిలువయు నౌచు
పుట్టుచు గిట్టుచు కొట్టుకొనుచును గట్టె వెదుకని కర్మ జీవా ॥తై॥



23. అరుదుగ దొరికెను నరజన్మం బిది
అరనిముసము వృథపరుపకురా
తెరవు నెరిగి చని పరమాత్ముని గని
చిరసుఖమొందర చింతా జీవా ॥తై॥
24. **నీ యదృష్టమున సాయికృష్ణుడై ఆ యఖిలేశుం దగుపడురా**
**హాయిగ సత్యసాయి నాత్మలో అరయుచు నిను నీవె ఎరుగుమురా** ॥తై॥
25. నీటుగ మాటలు కోటి పల్కిన నీ కడు పింతయు నిండదురా
సూటిగ నాత్మజ్యోతిని గన్ననె ఆటవిడుపు నీ కగునయ్యా ॥తై॥
26. వ్యర్థంబగు నీ వెర్రి బుఱ్ఱకథ విని యజ్ఞానము వీడు జీవా
సార్థక సత్యసాయి బుఱ్ఱకథ కని ప్రజ్ఞానము కొనరన్నా ॥తై॥

## జీవితకాలము

జీవితకాలము అత్యల్పము, లోకము అతివిశాలము, కాలము అనంతము. అయిననూ అనంతకాలమునందే మానవుడు తనలోని దివ్యత్వమును కనుక్కొని ప్రకటించి అభివృద్ధి చేసుకొనవలెను. జనులు కామక్రోధద్వేషములను దూరముచేసి శాంతము, సౌమ్యము, సంతోషము మొదలైన సద్గుణములను అభివృద్ధి చేసికొనవలెను. వారు ప్రేమోన్మత్తులై, కార్యతత్పరులై, ఉత్సాహభరితులై తమ తమ కర్తవ్యములను నిర్వహించినపుడే దేశమునకు క్షేమము.

## జీవిత పరమార్థము

"సర్వమున్ కదలన్ జేసెడి కాలమూర్తికి నమస్కారము" అన్నాడు భర్తృహరి. కాలము ఎవరినీ అనుసరించదు, ఎవరికోసమూ ఆగదు. **'శతమానం భవతి శతాయుః'** అన్నా అది విశ్వసించదగినది కాదు. కారణము **'నిత్యం సన్నిహితో మృత్యుః'** క్షణక్షణము కాయము మృత్యువును సమీపిస్తూనే ఉన్నది. గడచిపోయిన కాలమును క్షణమైనా వెనుకకు త్రిప్పలేము. **కాల ప్రవాహమును గుర్తించి వర్తించడమే కర్తవ్యము. మానవత్వమును మరువక, లక్ష్యమును విడువక, మానవ సంఘమునందు**

**మానవునిగా జీవించడమే జీవిత పరమార్థము.**

## జీవితఖైదు

పరమాత్మ సముద్రమయితే నీ ఆత్మ అందులో చెలరేగే ఒక అలలాంటిది. సముద్రం వేరు, అలవేరు కాదు. కాని వేరుగా కనిపిస్తున్నాయి. ఆ రెంటి మధ్యా సంబంధాన్ని సరిగా అర్థం చేసుకోవటంలోనే జీవిత పరమార్థం వుంది. ఆహార నిద్రా భయమైథునాలవంటి కార్యక్రమాలు పశుపక్ష్యాదులకు కూడా సామాన్య ధర్మమే. **మానవ జన్మ విశిష్టత ఆత్మ దర్శనమే. పుట్టినప్పటి నుంచి గిట్టేదాకా పశుపక్ష్యాదులలాగా పొట్టపోసికొనే తాపత్రయమే అయితే జీవితం వృథాగా గడిచిపోతుంది. మళ్ళీ ఇంకొక జీవితఖైదు (జన్మ) తప్పదు.**

## దేహము వ్యర్థము చేయవద్దు

దివ్యాత్మ స్వరూపులారా! భగవద్దత్తమైన మన జీవితమును, జన్మాంతర పుణ్యవిశేషము వలన దొరికిన ఈ దేహమును, **భోగభాగ్యముల నిమిత్తమని తలంచి వ్యర్థము చేయక, యోగత్యాగములకే** వినియోగించి సార్థకతను పొందండి. పరులమెప్పుకొరకు పనిచేయకూడదు; ఆత్మ తృప్తికై ప్రాకులాడాలి! ఇతరులకర్పణము కాదు ముఖ్యము; ఆత్మార్పణము గావించుకోవలెను. ఆత్మతృప్తి అనునది ప్రారంభస్థితిలో లక్ష్యము కావచ్చు; అయితే గమ్యస్థానము మాత్రము ఆత్మదర్శనము అని జ్ఞప్తియందుంచ కొనవలెను. మధ్య మధ్య వచ్చి అడ్డు పడుచున్న కష్టనష్టములు నిందానిష్ఠూరములు కేవలము అప్రధానము. ఆత్మను కోరినా తనను పరమాత్ముని కోరినట్లే, కాబట్టి కోరటమే అనవసరము. కావలసినదానినంతా, భగవంతుడే అందించును.

## మానవజన్మ

మరల మరల రాదు మానవజన్మము
నరుడు నారాయణుడగునట్టి యిలను
చెవికిసోక, యింకేల ఈజాగు నీకు
మేలుకొని సాయి పదసన్నిధిని చేరు॥



మానవజన్మచాలా పవిత్రమైనటువంటిది. విశిష్టమైనటువంటిది. విలువైనటువంటిది. జీవించ తగినటువంటిది. దేహ నిర్మాణం నందేకాక, మేధాశక్తి యందుకూడా మానవుడు మహావిశిష్టమైనటువంటివాడు. కాని, **ఇట్టి విశిష్టమైనటువంటి మానవత్వమునకు ఆయుఃప్రమాణము అతి స్వల్పముగా ఉన్నది.** ఇది ఎవ్వరూ మరువరానిది. ఈ మానవత్వమునకు అందించినటువంటి దివ్య మేధస్సును ఈ ఆయుఃప్రమాణము ఉన్నంతలోనే సద్వినియోగపరచి సరియైన సార్థకత పొందాలి. **మానవ శరీరము నీటి బుడగ వంటిది. ఏ నిముషములో ఈ నీటిబుడగ** శిథిలమవుతుందో తెలియదు. కనుక, ఈ జీవితము ఉన్నంత లోపలనే మానవత్వమును సార్థకము గావించుకొనుటకై ప్రతివ్యక్తి ప్రయత్నించాలి.

## మానవుని విశిష్టత

చర్మచక్షువులు మానవులకు మాత్రమేకాదు. పశుపక్షిమృగాదులకు, క్రిమికీటకాదులకు ఉంటున్నవి. మానవుని విశిష్టత ఏమిటి? జ్ఞానచక్షువులను తాను అభివృద్ధి పరచు కొనకుండిన ఈ చర్మచక్షువులు ఉండి పశు పక్షిమృగాదులతో సమానమనే అనిపిస్తుంది. మానవ జీవితము అమూల్యమైనది. అర్థవంతమైనది. అనుభవించదగినది. ఇట్టి **పవిత్ర మానవజీవితమును సార్థకము గావించుకొనవలెనన్న ఆత్మ జ్ఞానము అవసరము. 'జంతూనాం నరజన్మ దుర్లభం' కాని 'జ్ఞానేన శూన్యః పశుభిస్సమానః' జ్ఞానమే లేకుండిన పశువుతో సమానమే.** ఈ చర్మచక్షువులు బాహ్యమైన స్థూలమైన జగత్తును చూడగలుగుతున్నవే కాని సూక్ష్మమైన దివ్యత్వాన్ని గుర్తించుటకు సాధ్యం కాదు. ఎవరి నేత్రములు వారే చూడలేరు. ఎవరి నేత్రములు వారినే చూడలేవు. కనుక చర్మచక్షువులు సహజమైన జీవితానికి దృశ్య కల్పిత జగత్తును చూపించునవి మాత్రమే. **జ్ఞాననేత్రము ప్రతిమానవునకు అత్యవసరము. జ్ఞాననేత్రమన్నా, దివ్యనేత్రమన్నా, ఆత్మనేత్రమన్నా, బ్రహ్మనేత్రమన్నా ఒకదానికొకటి** పర్యాయపదములు. సర్వం బ్రహ్మమ్ అనే భావాన్ని మనము విశ్వసించినప్పుడే జగత్తంతయు బ్రహ్మ భావంతో రూపొందుతుంది. ఎట్టి భావమో అట్టి దృశ్యము. **దృష్టిని జ్ఞానమయముగా మార్చుకున్నప్పుడే సృష్టి బ్రహ్మమయంగా రూపొందుతుంది.** ఏవిధముగా

సముద్రములోని నీరు సూర్యుని వేడికి కాగి ఆవిరి అయి ఆకాశములో మేఘములుగా మారి, గాలి దుమారముచే దూరముగా మేఘములు చెల్లా చెదరైనను, తిరిగి కారుమబ్బులై వర్షించి, సెలయేరులై, నదులై తిరిగి తమ నిజస్థానమైన సముద్రమునకు చేరుకుంటాయి. అలాగే మానవుడు దైవత్వమునుండి వచ్చి, మధ్యగాలి దుమారములతో కామ క్రోధ మద మాత్సర్యాములతో, అహంకారముతో తలక్రిందలై చివరికి తన నిజస్థానమైన దైవాన్ని పొందుటకు తపన పడే కృషిచేయాలి. అభ్యాసము ద్వారా పరమాత్మను పొందు. పాముకు రెండు పిచ్చి గుణములు కలవు. ఒకటి వంకరిటింకరి నడక; రెండవది చూచినదానినంతా, అడ్డమువచ్చిన వాటినన్నింటినీ, కరచుట. ఈ రెండునూ మానవునిలో అక్షరాలా ప్రత్యక్షమగు చున్నవి. చక్కని నడకలేదు, చూచినవన్నింటినీ పట్టుకొనుటకు ప్రయత్నించును. అయితే పాములో ఒక పవిత్రమైన స్వభావమున్నది. అది యేదనిన నాగస్వరము పట్టిన, యెట్టి విషసర్పమయినా ఆనందముగా అందులో పడగవిప్పి ఆడుతూ తన సర్వస్వమునూ ఆ స్వరమున లీనము చేయును. **అటులనే మానవుడు అభ్యాసముద్వారా ప్రణవములో మనసును లీనము చేయవచ్చును.** కనుక శబ్దోపాసన పరమాత్ముని పొందుటకు ప్రధానమార్గమై యున్నది. **శబ్దమే పరమాత్మ.**

## మానవ ధర్మం

శాంతి, సహనం, సత్యం, దయ, సానుభూతి, త్యాగం...... ఇలాంటి సద్గుణాలను పోషించుకోవడమే మానవధర్మం.

## మానుషాకారము

**పంచభూతములు మానవునికి ప్రధానమైన పంచప్రాణములు.** ఈ ప్రాణములే లేకుండిన జీవితమే లేదు. **ఇందులో 'వాయువు' అనే ప్రాణము సర్వత్రా వ్యాపించి యుంటున్నది.** కాని మనకు కనిపించదు. చేతికి చిక్కదు. కనిపించనంత మాత్రమున లేదని భావించరాదు. గాలిలేకపోతే నీవు ఎలా ఉన్నావు? అదియే నీ శ్వాస. **ఈ శ్వాస ఉండినంత వరకే ఇది శివం. ఈ శ్వాసనే పోతే శవం కాబట్టి, శ్వాసనే ఈశ్వర స్వరూపం.** ఈ శ్వాసనే నిజమైనటువంటి గాలి స్వరూపము. ఈ స్వరూపాలతో భగవంతుడు మానవుని యందు సంచరిస్తూ శతవిధాలా మానవుని సంరక్షిస్తున్నాడు.



కనుక భగవంతుడు అంటే ఏదో ఒక పెద్ద ఆకారంతో ఉన్నాడని భావించరాదు. ఆ ఆకారములన్నీ మనం కలిపించుకున్నవే. భగవంతునకు నాల్గు చేతులు పెట్టారు. శంఖం, చక్రము, గద, పద్మములు పెట్టారు. భగవంతునకు నాలుగు చేతులున్నాయా? లేదు. **భగవంతుడు సర్వశక్తిమయుడు అని గుర్తింపచేయటానికి నాలుగు చేతులుగా పెట్టారు. ఒక చేతిలో శంఖం. ఆ శంఖమే శబ్దబ్రహ్మము. ఇంకొకచేతిలో చక్రము. ఆ చక్రమే కాలచక్రము. కాబట్టి ఈ శబ్దము, కాలము భగవంతుని చేతిలోనే ఉంటున్నాయన్నమాట. మరొకచేతిలో గద. గద అనగా బలము. బలము కూడా భగవంతుని చేతిలోనే ఉంటున్నది. మరొక చేతిలో పద్మము అనగా హృదయము. ఇది కూడానూ భగవంతునిచేతిలో ఉంటున్నది** ఇవన్నీ అర్థం గావించుకొనే నిమిత్తమై ఈవిధమైన ఆకారములు నిర్మిస్తూ వచ్చారు. ఆకారము కాదు, **మానుషాకారమే శాశ్వతమైన ఆకారము. అటువంటి దైవం మానుషరూపేణ.** కనుక ఆ మనుష్య నిజస్వరూపం లోపల ఏది ఉత్తమమైనదో ఏది పవిత్రమైనటువంటిదో, ఏది సర్వకర్మకూ ఆధారమైనటువంటిదో, ఏది సర్వాధారమైనటువంటిదో, అలాంటి మానవత్వాన్ని మనం విశ్వసించాలి. మనకు ప్రసాదించిన ఇంద్రియాలను సద్వినియోగపరచాలి. అప్పుడే నీవు నిజమైన మానవుడవు అయిపోతావు.

## మనిషిగా జీవించాలి

మీరు భగవంతుని నుండి వచ్చారు. (From God) మీరు భగవంతునితోనే ఉన్నారు (With God). మీరు భగవంతుని కోసమే జీవిస్తున్నారు (For God). మీరు భగవంతుడినే చేరుకుంటారు (To God). భగవంతుడు మీలోనే మీవెంటనే ఉన్నాడు. నీవు మంచి మనిషిగా జీవించాలి. (Good man) గా తయారైనపుడే God man గా రూపొందగలవు. **తల్లి అయినా మనకు దూరంగా ఉంటుంది.** గాని భగవంతుడు **అందరికంటే నీకు సమీపుడు. దైవమంత సమీపుడు మరొకడు లేనేలేడు. దైవం చాల Nearest and Dearest** అట్టిదానిని మనం దూరం చేసుకుంటున్నాము. **ఇది అజ్ఞానం. The best way to love God is to love all and serve all.**

### భగవాన్ సంకల్పము

యావత్ మానవకోటిని నా దివ్య ప్రబోధములచే దైవోపమ్ముఖులుగా మార్చెడి మానసిక పరివర్తనమును, ఉత్తేజమును, సంచలనమును, నా ప్రేమ ప్రభావముతో కలుగజేసి వారి నందరిని లాలించి, పాలించి, **నాలో ఐక్యము చేసికోటమే నాలక్ష్యము.** మానవత్వము నుండి మాధవత్వమునకు దారి చూపుటయే నా సంకల్పము.

సత్యమే నా ప్రచారము
ధర్మమే నా ఆచారము
శాంతియే నా స్వభావము
ప్రేమయే నా స్వరూపము

### మానస భజరే గురుచరణం

అవ్యాజకృపతో నవతరించిన సద్గురుచరణుల సంపూర్ణ శరణాగతులు కండు. మానస భజరే గురుచరణం; దుస్తర భవసాగర తరణం. సత్యాన్వేషకులారా; అనన్య మనస్కులై సద్గురుచరణముల భజింపుడు. జనన మరణ రూప సంసారార్ణవమును తరించి, బంధవిముక్తి, నిత్యానంద ప్రాప్తిని గాంచగలరు.

సద్గురు చరణములను ఆశ్రయించి తరించుదాము

జై సాయిరాం

## నరజన్మ

నరజన్మ దుర్లభమురా సోదరా ॥సోదరా॥
జన్మలన్నింటిలో నరజన్మ దుర్లభమురా

వేద శాస్త్రము ఘోషించు నరజన్మ దుర్లభమురా ॥సోదరానర॥

భోగభాగ్యములు క్షణ భంగురములురా
సోదరా నరజన్మ దుర్లభమురా ॥సోదరా॥

ఎంత పుణ్యమో నరుడై పుట్టితివి
సకల సాధనలకు రాదారి మార్గము
నరజన్మ దుర్లభమురా ॥సోదరా॥

సంసార సాగరము దాటుటకు
సులభ మార్గము భక్తిమార్గమురా ॥సోదరా॥

సర్వ ప్రాణులలో ఆత్మ స్వరూపుడై
వున్న మాధవుని సేవించుమురా! ॥సోదరా॥

(తూములూరు కృష్ణమూర్తి)